www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 29-11-2022 సంపుటి : 04 సంచిక :87 పేజీలు : 4 వెల : రూ 3-00









# వ్యవసాయరంగంలో కొత్త ఒరవడిని తీసుకువచ్చాం



**క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో నగదు జమ**

**5.68 లక్షల మందికి రూ. 115.33 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీ**

**క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి విడుదల చేసిన సిఎం జగన్**

అమరావతి,నవంబర్28 : వ్యవసాయరంగంలో తాము కొత్త ఒరవడిని తీసుకొచ్చామని ఏపీ సీఎం జగన్ అన్నారు. 2020-21 సీజన్ లో అర్హత పొందిన 2.54 లక్షల మందికి రూ. 45.22 కోట్లు, ఖరీఫ్ 2021 సీజన్ లో అర్హత పొందిన 5.68 లక్షల మందికి రూ. 115.33 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి బటన్ నొక్కి వారి ఖాతాల్లోకి జమ చేశారు. దీంతోపాటు... గోదావరి వరదలు, అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న 45,998 మంది రైతులకు రూ. 39.39 కోట్ల ఇన్ పుట్ సబ్సిడీని అందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. తమది రైతులకు అండగా నిలబడే ప్రభుత్వమన్నారు. వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని చెప్పి చంద్రబాబు రైతులను మోసం చేశారని జగన్ విమర్శించారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా పథకం లేదని, సున్నా వడ్డీ పథకాన్ని ఎగ్గొట్టిందని అన్నారు. గత ప్రభుత్వానికి, ఇప్పుడున్న ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడాను గమనించాలని కోరారు. రుణమాఫీకి చంద్రబాబు కేవలం రూ. 15 వేల కోట్లను మాత్రమే ఇచ్చారని.. వైసీపీ ప్రభుత్వం రూ. 25,971 కోట్లను ఇచ్చిందని చెప్పారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకోగలిగితేనే రాష్ట్రం బాగుంటుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు క్రమం తప్పకుండా పరిహారం చెల్లిస్తోందని, ఏ సీజన్‌లో పంట నష్టం జరిగితే అదే సీజన్‌లో పరిహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని ఏపీ ముఖ్యమంత్రి సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం రైతులను మోసం చేస్తే.. తమ ప్రభుత్వం మాత్రం రైతుల పక్షాన నిలబడిందని అన్నారు. రూ.లక్షలోపు పంట రుణాలకు వడ్డీ రాయితీ, అకాల వర్షాలు, వరదలతో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీని ఆయన తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కి రైతుల ఖాతాల్లో జమ చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకు పంటనష్టపోయిన రైతన్నలకు రూ.1834 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని సీఎం వెల్లడించారు. సన్నా, చిన్నకారు రైతులతో పాటు వాస్తవ సాగుదారులకు పంట రుణాలపై వడ్డీ భారం తగ్గించేందుకు వైఎస్సాఆర్ సున్నా వడ్డీ పథకాన్ని ప్రవేశపెట్టామని చెప్పారు. అందులో భాగంగా రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించిన అన్నదాతలకు రూ.160.55 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్లు చెప్పారు. రైతన్నలకు ఇన్‌పుట్ సబ్సిడీ, వైస్సార్ సున్నా వడ్డీ పథకం కింద రూ.200 కోట్లు వారి ఖాతాల్లోకి జమచేస్తున్నాం. మన అందరి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక ఇప్పటి వరకూ 21.31 లక్షల మంది రైతులకు రూ.1834 కోట్లు ఇచ్చాం. గత రబీ, ఖరీఫ్‌లో రుణాలు చెల్లించిన 8,22,411 రైతులకు రూ.160.55 కోట్లు ఇస్తున్నాం. చంద్రబాబు ఎగ్గొట్టిన బకాయిలతో కూడా కలుపుకుని 73.88 లక్షల మంది రైతులకు రూ.1834.55 కోట్లు ఇచ్చాం. గతంలో పంటల బీమాలో రైతులు తమ వాటా తామే కట్టుకున్నారు. చంద్రబాబు హయంలో బీమాకింద చెల్లించింది కేవలం రూ.3,411 కోట్లు మాత్రమే. మన ప్రభుత్వం వచ్చాక ఉచిత పంటల బీమా అమలు చేసింది. రైతుల ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించింది. ఈ మూడేళ్లకాలంలో రూ.6,685 కోట్లు చెల్లించాం. 10,778 రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి గ్రామంలోనూ నాణ్యమైన సర్టి÷డ్ ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు లభిస్తు?న్నాయి. 9 గంటలపాటు క్వాలిటీ విద్యుత్‌ను మన ప్రభుత్వం పగటిపూట అందిస్తోంది. గత ప్రభుత్వం పాడిరైతులకు ఎలా అన్యాయం చేయాలని చూస్తే.. మన ప్రభుత్వం అమూల్ ద్వారా వారిని ఆదుకుందని సీఎం జగన్ అన్నారు. అన్నదాతలకు అండగా నిలుస్తూ.. ఈ క్రాప్ ఆధారంగా రూ. లక్షలోపు రుణం తీసుకొని సకాలంలో చెల్లించిన రైతన్నలకు పూర్తి వడ్డీ మాఫీ చేన్నున్నామని సీఎం జగన్ వెల్లడించారు. రైతు సంక్షేమం విషయం లో గత ప్రభుత్వానికి, తమ ప్రభుత్వానికి మధ్య చాలా తేడా ఉందని అన్నారు. రైతన్నల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వం ఏనాడు రైతుల పక్షాన నిలబడలేదని అన్నారు. 'రైతులకు ఇన్‌పుట్ సబ్సీడీలో కొత్త ఒరవడి సృష్టించాం. ఏ సీజన్‌లో నష్టం జరిగితే ఆ సీజన్‌లోనే చెల్లిస్తున్నాం. క్రమం తప్పకుండా రైతులకు పరిహారం చెల్లిస్తున్నాం. వరుసగా మూడో ఏడాది వైఎస్సాఆర్ సున్నా వడ్డీ పథకాన్ని అమలు చేస్తున్నాం. గతంలో వైస్సాఆర్ రైతు భరోసా వంటి పథకం లేదు. పంట రుణాలు ఏడాదిలో తీర్చిన రైతులకు పూర్తి రాయితీ ఇచ్చాం.

# జగన్ అక్రమాస్తుల కేసు.. ఇద్దరు ఐఏఎస్‌లకు హైకోర్టులో చుక్కెదురు



హైదరాబాద్: జగన్ అక్రమాస్తుల కేసులో ఇద్దరు విశ్రాంత ఐఏఎస్ అధికారులకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. లేపాక్షి నాలెడ్జ్ హబ్, అరబిందో హెటిరో ఛార్జిషీట్‌లో బీపీ ఆచార్యపై సీబీఐ కోర్టు అవినీతి నిరోధక చట్టం అభియోగాలను పరిగణనలోకి తీసుకోవడాన్ని ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. తనపై అవినీతి నిరోధక చట్టం అభియోగాలను పరిగణనలోకి తీసుకోవడం సరైంది కాదన్న బీపీ ఆచార్య వాదనను ధర్మాసనం తోసిపుచ్చింది. అదేవిధంగా విశ్రాంత ఐఏఎస్ కృపానందం పరిశ్రమల శాఖ కార్యదర్శిగా ఉన్న సమయంలో కృపానందం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సీబీఐ అభియోగాలు దాఖలు చేసింది. ఈ క్రమంలో రఘురాం సిమెంట్స్ ఛార్జిషీట్ కొట్టివేయాలన్న కృపానందం అభ్యర్థనను న్యాయస్థానం తోసిపుచ్చింది. సీబీఐ కోర్టు నిర్ణయాల్లో ప్రస్తుత దశలో జోక్యం చేసుకోలేమని.. జోక్యం చేసుకోవడానికి తగిన కారణాలు కనిపించడం లేదని హైకోర్టు స్పష్టం చేసింది.

## జ్యోతిరావు పూలేకు సీఎం జగన్ నివాళి

అమరావతి: మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ విజయసాయి రెడ్డి, ఎంపీ మార్గాని భరత్ రామ్ పాల్గొన్నారు. జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహానికి మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జోగి రమేష్ నివాళులర్పించారు.



## పవన్ కళ్యాణ్.. ఈ 39 మంది ఎవరు?

అమరావతి: మంగళగిరిలో నియోజకవర్గ పరిధిలోని ఇప్పటం గ్రామానికి చెందిన 39 మందికి రూ.లక్ష చొప్పున ఆదివారం చెక్కులు పంపిణీ చేశారు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్. పవన్ చెక్కులు అందజేసిన 39 మందిలో జనసేన పార్టీ ఆవిర్భావ సభకు భూములు ఇచ్చిన వారెవరూ లేకపోవడం విశేషం. ప్పటంలో రోడ్డు ఆక్రమించుకున్నారని అధికారులు 53 మందికి నోటీసులిచ్చారు. ఒకరు హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో మిగతా 52 మంది ప్రహరీలను మాత్రమే కూల్చివేశారు. ఒక్క ఇల్లు కూడా కూల్చలేదు. అయితే మార్చి 14న జనసేన పార్టీ ఆవిర్భావ సభకు భూములిచ్చినందునే ఇళ్లు కూల్చి వేశారని పవన్ నానా యాగీ చేస్తున్నారు. ఇప్పుడు బాధితుల పేరుతో పవన్ చెక్కులు ఇచ్చిన 39 మందిలో ఆ రోజు సభకు భూములిచ్చిన వారిలో ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. జనసేన ఆవిర్భావ సభను ఇప్పటంలో 6.70 ఎకరాల్లో నిర్వహించామని ఆ పార్టీ నేత నాదండ్ల మనోహర్ చెప్పారు. వింటా సాంబిరెడ్డి, తిరుమలశెట్టి సామ్రాజ్యం, ఎల్.ఆదినారాయణ, గాజుల సాంబయ్య, శంకరశెట్టి శ్రీనివాసరావు, శంకరశెట్టి పిచ్చయ్య, శంకరశెట్టి రాయుడు, ఉమామహేశ్వరరావు, గాజుల నరసయ్యల భూమి అది. ఇందులో 8 మంది పేర్లు ఆక్రమణల జాబితాలోనే లేవు. వాళ్లలో ముగ్గురు అసలు ఆ గ్రామంలోనే ఉండరు. ఇంకొకరు ఆక్రమణల పరిధిలోకి వచ్చినా, అతడు ముందే హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో అతని ప్రహరీని తొలగించలేదు. అయితే ఆదివారం పవన్ చెక్కులు పంపిణీ చేసిన వాళ్లలో వీళ్లెవరూ లేరు. ప్రహరీలు తొలగించిన రోడ్డులో ఇల్లు లేని వారికి, నోటీసులు కూడా అందుకోనివారికి చెక్కులు పంపిణీ చేశారని ఇప్పటం గ్రామస్తులు చెబుతున్నారు.



# అమరావతిపై ప్రభుత్వానికి స్వల్ప ఊరట



**హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే**

**నిర్ణీత కాలంలో నిర్మాణాలు జరపాలని ఎలా చెబతాం**

**హైకోర్టు ప్రభుత్వంలా వ్యవహరించరాదని సుప్రీం వెల్లడి**

**విచారణ జనవరి31 వాయిదా వేసిన ధర్మాసనం**

న్యూఢిల్లీ,నవంబర్28 : అమరావతి రాజధాని అంశంలో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట వచ్చింది. రాజధాని అమరావతిపై సుప్రీం కోర్టు సోమవారం విచారణ చేపట్టింది. కాల పరిమితితో రాజధాని పూర్తి చేయాలన్న హైకోర్టు ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధించింది. హైకోర్టు ప్రభుత్వంలా వ్యవహరిస్తోందా ? అని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకరిస్తే ఎలా?. హైకోర్టు ఏమైనా టౌన్ ప్లానరా ? ఆరు నెలల్లో నిర్మాణం చేయాలంటారా ?. మీరే ప్రభుత్వమైతే అక్కడ కేబినెట్ ఎందుకు ? అభివృద్ధి ఎలా చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కదా ? హైకోర్టు ఈ విషయంలో తన పరిధిని అతిక్రమించిందని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజధాని ఇదే ప్రాంతంలో ఉండాలని ఒక రాష్ట్రాన్ని ఆదేశించలేదని, ఒకే ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్రానికి చెప్పలేం అని, ప్రతివాదులకు కోర్టు నోటీసులను జారీ చేసింది. తదుపరి విచారణ జనవరి 31కి వాయిదా వేసింది. అమరావతిలో నిర్మాణాలు, స్థలాలపై డెడ్‌లైన్ పెట్టి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై స్టే ఇచ్చింది. తదుపరి విచారణను వచ్చే జనవరి 31కి వాయిదా వేసింది. ప్రతివాదులైన రైతులకు, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. అభ్యంతరాలు ఉంటే చెప్పాలని స్పష్టం చేసింది. అమరావతినే రాజధానిగా కొనసాగించాలని ఈ ఏడాది మార్చి 3న హైకోర్టు తీర్పు చెప్పింది. రాజధానిని నిర్ణయించే అధికారం అసెంబ్లీకి లేదని పేర్కొంది. ఆ సందర్భంగానే ప్రభుత్వానికి కొన్ని స్పష్టమైన డెడ్‌లైన్లు పెట్టింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు అప్పీల్‌కు వెళ్లింది. దానిపై సోమవారం వాద, ప్రతివాదనలు జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు తీర్పుపై తీవ్ర వ్యాఖ్యలు చేసింది సుప్రీంకోర్టు ధర్మాసనం. హైకోర్టు తమ పరిధి దాటిందని, ఎగ్జిక్యూటివ్ పవర్స్‌ని కూడా హైకోర్టే అమలు చేస్తోందని వ్యాఖ్యానించింది. ఒకేచోట నగరాభివృద్ధి కేంద్రీకరించడం కంటే వేర్వేరు పట్టణాలను అభివృద్ధి చేయడం బెటరని, అలాంటప్పుడు హైకోర్టు జోక్యం చేసుకోవడం సమంజసం కాదని అభిప్రాయపడింది. గతంలో ఏడు అంశాల వారీగా తీర్పు చెప్పింది హైకోర్టు. అందులో 3 నుంచి 7 అంటే ఐదు అంశాలపై స్టే విధించింది సుప్రీంకోర్టు. హైకోర్టు తీర్పు మూడో అంశంలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీలు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను నెలరోజుల్లో పూర్తిచేయాలని ఆదేశించింది. 4వ అంశంలో మాస్టర్ ప్లాన్‌ను పూర్తి చేయాలని స్పష్టం చేసింది. 5వ అంశంలో అమరావతి కేపిటల్ సిటీ, కేపిటల్ రీజియన్ నిర్మాణాన్ని 6 నెలల్లో చేపట్టాలని ఆదేశించింది. 6వ అంశంలో అమరావతి కేపిటల్ సిటీని నివాసయోగ్యంగా మార్చాలని, ఏడో అంశంలో కేపిటల్ రీజియన్‌లో స్థలాల్ని రైతులకు 3 నెలల్లోగా కేటాయించాలని స్పష్టం చేసింది. ఈ ఐదు అంశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. ఏపీ ప్రభుత్వం తరపున మాజీ అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ వాదనలు వినిపించారు. న్యాయమూర్తులు కేఎం జోసెఫ్, బీవీ నాగరత్నల ధర్మాసనం ముందు విచారణ జరిగింది. హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలని సుప్రీంలో ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. అమరావతిపై హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు అయ్యేలా చూడాలని రైతులు కోరారు. కాగా.. హైకోర్టు తీర్పుపై పూర్తి స్థాయి స్టే ఇవ్వడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పులోని కొన్ని అంశాలపై మాత్రమే మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. రాజధానిలో నిర్మాణాలపై హైకోర్టు విధించిన కాలపరిమితికి సంబంధించి మాత్రమే సుప్రీం స్టే విధించింది. రాజధానిపై అసెంబ్లీకి చట్టం చేసే అధికారం లేదని హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించడానికి సుప్రీం నిరాకరించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు జారీ చేసింది.

## కొలీజియం సిఫార్సులపై కేంద్రం తీరు.. విసుగుతెప్పిస్తోంది: సుప్రీం

దిల్లీ: హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫార్సులను నెలల తరబడి కేంద్రం పెండింగ్‌లో పెట్టడంపై సుప్రీంకోర్టు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. కొలీజియం సిఫార్సు చేసిన కొన్ని పేర్లు ఏడాదిన్నరగా పెండింగ్‌లోనే ఉండటంపై ధర్మాసనం మండిపడింది. ఈ ఆలస్యం అసహనానికి గురిచేస్తోందని వ్యాఖ్యానించింది. న్యాయమూర్తుల నియామకాల్లో జరుగుతున్న జాప్యాన్ని సవాల్‌చేస్తూ అడ్వొకేట్స్ అసోసియేషన్ బెంగళూరు దాఖలుచేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కిషన్‌కౌల్, జస్టిస్ అభయ్ శ్రీనివాస్ ఓకాలతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. "ఎలాంటి కారణాలు లేకుండా కొలీజియం సిఫార్సులను పెండింగ్‌లో పెట్టకూడదు. కొన్ని పేర్లను ఏడాదిన్నరకు పైగా పెండింగ్‌లోనే ఉంచుతున్నారు. ఇది మొత్తం వ్యవస్థకే విసుగుతెప్పిస్తోంది. జైతోష్ మజుందార్ పేరును కొలీజియం రెండోసారి పునరుద్ఘాటించినప్పటికీ 2021 సెప్టెంబర్ 4 నుంచి ఆయన నియామకం పెండింగ్‌లో ఉంది. చివరకు సదరు వ్యక్తి ఇటీవల కన్నుమూశారు. కొలీజియం సిఫార్సు చేసిన మరో వ్యక్తి.. ఆలస్యం కారణంగా తనంతట తానే వెనక్కి తగ్గారు" అని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ప్రస్తుతానికి ఈ కేసులో తాము నోటీసులు మాత్రమే జారీ చేస్తున్నామని చెప్పిన ధర్మాసనం.. చట్టం ఉన్నంతవరకూ దాన్ని పాటించాలన్న కోర్టు సూచనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌కు సూచించింది. నియామకాల సమస్యను కేంద్రం వెంటనే పరిష్కరించాలని కోర్టు స్పష్టం చేసింది.


## 'ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం న్యాయమైంది'

కర్నూలు: మూడు రాజధానులపై ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం న్యాయమైందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. మూడు రాజధానుల అంశానికి సంబంధించి హైకోర్టులో భిన్న తీర్పులు వచ్చాయని, అయితే ఒకే ప్రాంతానికి అభివృద్ధి కేంద్రీకృతం కావడం వల్ల రాష్ట్రానికి నష్టం కలుగుతుందని, సుప్రీంకోర్టు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందన్నారు సజ్జల. ఈరోజు(సోమవారం) కర్నూలులో మీడియాతో మాట్లాడిన సజ్జల.. ' సీఎం వైఎస్ జగన్ ఆశయాలను నెర వేరుతున్నాయి, ఆయన తీసుకున్న నిర్ణయానికి ఏపీలో ప్రజలు మద్దతు ఇస్తున్నారు..స్వాగతిస్తున్నారు. చట్టం కూడా సీఎం వైఎస్ జగన్‌కు సహకరిస్తుంది. చంద్రబాబు నాయుడు కుట్రలకు సుప్రీంకోర్టు మొట్టికాయలు కొట్టింది. ఒకే చోట రాజధాని కట్టాలని హైకోర్టు చెప్పడం సరైనది కాదు, దానిపై సుప్రీంకోర్టు తప్పుపట్టి, ప్రశ్నించింది. పవన్ కళ్యాణ్, రామోజీ రావు కోరిక చంద్రబాబు సీఎం కావాలనేది. కానీ ఇది ప్రజలు తప్పుపడుతున్నారు. పవన్ కళ్యాణ్ అధికారంలోకి రావాలని కోరిక లేదు. చంద్రబాబు సీఎం కావాలని ప్రయత్నాలు చేయడం హాస్యాస్పదంగా ఉంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు పూర్తి మద్దతు ఇస్తున్నారు' అని సజ్జల పేర్కొన్నారు.



## ఏపీలో పోలీసు నియామకాలకు నోటిఫికేషన్ విడుదల

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు నియామకాలకు నోటిఫికేషన్ విడుదలైంది. వివిధ విభాగాలకు సంబంధించి మొత్తంగా 6,100 కానిస్టేబుల్, 411 ఎస్సై పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. వాటిలో 315 ఎస్ఐ, 96 రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్, 3,580 కానిస్టేబుల్ (సివిల్), ఏపీఎస్పీలో 2,520 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నారు. కానిస్టేబుల్ పోస్టులకు జనవరి 22న, ఎస్సై పోస్టులకు ఫిబ్రవరి 19న ప్రిలిమనరీ రాత పరీక్ష నిర్వహించనున్నారు. ఎస్ఐ పోస్టులకు డిసెంబరు 14 నుంచి జనవరి 18 వరకు దరఖాస్తులు స్వీకరించగా.. ఫిబ్రవరి 19న ప్రిలిమ్స్ పరీక్ష ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2 పరీక్ష ఉంటుంది.



# సంపాదకీయం

మంగళవారం 29-11-2022

## వరం శాపంగా మారకుండా చూసుకోవాలి

ప్రస్తుతం గూగుల్‌ను 'కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్ నెట్స్'గా పిలుస్తున్నారు. గూగుల్ పదానికి విస్తరణగా 'గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఓరియంటెడ్ గ్రూప్ లాంగ్వేజ్ ఆఫ్ ఎర్త్' ను వాడుతున్నారు.మానవ పరిణామ క్రమంలో నాటి పాత రాతి యుగం నుంచి నేటి నవ్య నానో -డిజిటల్ యుగం వరకు జరిగిన శాస్త్ర సాంకేతిక విప్లవంతో మానవాళి జీవనశైలిలో సమూల మార్పు లు చోటు చేసుకున్నాయి. ప్రపంచమే కుగ్రామమై పోయింది. ఇ -మెయిల్, యూ ట్యూబ్, వాట్సాప్, ఫేస్‌బుక్, గూగుల్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, మెసెంజర్ లాంటి సామాజిక మాధ్యమాలు మన నిత్య జీవితంలో భాగం అయ్యా యి. ప్రపంచ వ్యాప్తంగా కంప్యూటర్ల వ్యవస్థను రిమోట్ కంట్రోల్ ద్వారా అనుసంధానం చేస్తూ సమాచారాన్ని ఒకరి నుండి మరొకరికి చేర్చడాన్ని ఇంటర్‌నెట్‌గా చెప్పుకుంటున్నాం. ఇంటర్నెట్ లేదా ఇంటర్ కనెక్టెడ్ నెట్‌వర్క్ వాడకుండా గంట గడవడం అసాధ్యంగా తోస్తున్నది. అరచేతిలో వైకుంఠం చూపే స్మార్ట్ ఫోన్ మానవ శరీరంలో ఒక శాశ్వత అంగమై కూర్చుంది.స్మార్ట్ ఫోన్లు, ట్యాబులు, కంప్యూటర్లు, లాప్‌ట్యాప్‌లు, కెమెరాలు, టివిలు, ఇతర ఎలెక్ట్రానిక్ ఉపకరణాలు వైఫై సహాయంతో ఇంటర్నెట్ సౌకర్యాలను పొందడం వరంగా మారింది. విశ్వవ్యాప్తంగా నేడు ఒక బిలియన్ వెబ్‌సైట్లు వాడుకలో ఉన్నాయి. ఇంటర్‌నెట్ ఆధార కంపెనీలు మైక్రోసాఫ్ట్ 75 బిలియన్లు, ఆపిల్ 45 బిలియన్లు, ఫేస్‌బుక్ 44 బిలియన్లు, గూగుల్ 35 బిలియన్ల అమెరికన్ డాలర్ల బడా వ్యాపారం చేస్తున్నాయిఇంటర్నెట్ సహాయంతో ఫేస్‌బుక్ అనబడే సామాజిక మాధ్యమాన్ని 2004లో 'మార్క్ జుకెర్ బర్గ్' కనిపెట్టడం జరిగింది. 1971లో 'రే టాం లిన్సన్' ప్రప్రథమ ఇ మెయిల్ పంపడంతో ఆరంభమై, నేడు 3.6 బిలియన్ల ఇ -మెయిల్ అకౌంట్లతో రోజుకు 294 బిలియన్ల ఇంటర్నెట్ ఇ -మెయిల్స్ ప్రపంచ వ్యాప్తంగా పంపించే స్థాయికి చేరింది. 1990లో మైక్రోసాఫ్ట్ విండో స్, 1994లో యాహూ, 1995లో ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్, 1998లో గూగుల్, 2006లో ట్విట్టర్‌లు లాంటి అనేక యాప్‌లు వాడుకలోకి వచ్చాయి. 23 ఏప్రిల్ 2005న తొలి 'యూ ట్యూబ్' వీడియోను సాంకేతిక నిపుణుడు 'సాన్ డీగో జూ' అప్‌లోడ్ చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ వాడడానికి 50 మిలియన్ హార్స్ పవర్ విద్యుత్తు అవసరం అవుతున్నది. ప్రస్తుతం గూగుల్‌ను 'కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్ నెట్స్'గా పిలుస్తున్నారు. గూగుల్ పదానికి విస్తరణగా 'గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఓరియంటెడ్ గ్రూప్ లాంగ్వేజ్ ఆఫ్ ఎర్త్' ను వాడుతున్నారు. స్మార్ట్ ఫోన్లు, ట్యాబులు, కంప్యూటర్లు, లాప్‌ట్యాప్‌లు, కెమెరాలు, టివిలు, ఇతర ఎలెక్ట్రానిక్ ఉపకరణాలు వైఫై సహాయంతో ఇంటర్నెట్ సౌకర్యాలను పొందడం వరంగా మారింది. విశ్వవ్యాప్తంగా ఒక బిలియన్ వెబ్‌సైట్లు వాడుకలో ఉన్నాయి. మైక్రోసాఫ్ట్ 75 బిలియన్లు, ఆపిల్ 45 బిలియన్లు, ఫేస్ బుక్ 44 బిలియన్లు, గూగుల్ 35 బిలియన్ల అమెరికన్ డాలర్ల బడా వ్యాపారం చేస్తున్నాయి.ఇంటర్‌నెట్‌తో ఎలెక్ట్రానిక్ మెయిల్స్, పరిశోధనలు, డౌన్ లోడ్ ఫైల్స్, ఆన్‌లైన్ చర్చలు, గేమ్స్, ఇ -విద్య, స్నేహం, ప్రింట్ మీడియా, సామాజిక మాధ్యమాలు, విజ్ఞాన వినిమయం, చలన చిత్రాలు, ఫైల్ ట్రాన్స్‌ఫర్, వర్చువల్ సమావేశాలు, ఇ లైబ్రరీ, కృత్రిమ మేధ, ఆర్థిక, బ్యాంకింగ్ కార్యకలాపాలు మె?దలగు అనేక రంగాలలో విస్తృత ఉపయోగాలు ఉన్నాయి. మానవాళికి ఇంటర్‌నెట్ గొప్ప వరంగా మారినప్పటికీ, మరో కోణంలో శాపంగా పరిణమించడం విచారకరం. పిల్లలకు కరోనా విధించిన ఆన్‌లైన్ ఇ -తరగతులతో ఉపయోగపడుతున్న స్మార్ట్ ఫోన్‌లు మరో వైపు అశ్లీల అభ్యంతరకర ఇంటర్‌నెట్ మాధ్యమాలు అరచేతిలో అందుబాటులోకి రావడం వారి భవిష్యత్తుకే ప్రమాదకరంగా మారుతోంది. స్మార్ట్ ఫోన్ వినియోగం దుర్వసనంగా మారింది. నీలికాంతితో కంటి చూపు దెబ్బ తినడం, సమయం వృర్థం చేయడం, నేర ప్రవృత్తికి బీజాలు పడడం, ఓపిక నశించడం, అనారోగ్య సమస్యలు, ఏకాగ్రత లోపిం చడం, సమాజానికి దూరంగా ఒంటరితనం కోరుకోవడం, దురలవాట్లను ప్రేరేపించడం, అశ్లీల సైట్లకు అలవాటు పడడం, పనిలో శ్రద్ధ తగ్గడం, స్థూలకాయ రుగ్మతలు, అనవసర వస్తువులు ఆన్ లైన్‌లో కొనడం, నిద్ర లేమి, సైబర్ నేరాలు మె?దలగు విష ప్రభావాలను సమాజం చవిచూడవలసి వస్తున్నది. అంతర్జాల నేరాలను కట్టడి చేయడానికి సైబర్ నేరాల అదుపుకు సంబంధించిన కొత్త చట్టాలు కూడా అందుబాటుకి రావడం చూస్తున్నాం. కంప్యూటర్ అక్షరాస్యత కనీస అర్హత అవుతున్నది. నిరక్షరాస్యులు కూడా ఇంటర్‌నెట్‌ను వినియోగిస్తున్నారు. నిత్య జీవితంలో మనిషిని ఇంటర్‌నెట్ చుట్టేస్తున్నది. ఇలాంటి ఇంటర్నెట్‌ను సురక్షితంగా మానవాళి సుస్థిరాభివృద్ధికి వాడుతూ, దుష్ప్రభావాలకు దూరంగా ఉంటూ, సుఖశాంతులు, సంపదలతో వసుధైక కుటుంబాన్ని నిర్మించుకుందాం. ఇంటర్‌నెట్ ఆత్మసౌందర్య వికాసానికి, సులభతర జీవన విధానానికి వినియోగించుకుందాం. 'ఇంటర్నెట్ ఈజ్ ఫర్ బెట్టర్‌మెంట్' అనే నినాదాన్ని ప్రచారం చేద్దాం.

# జగన్ ముందస్తు హడావిడి

విజయవాడ, నవంబర్ 28 ముందస్తు ఎన్నికల గురించి ఏపీలో చాలా కాలంగా చర్చ జరుగుతోంది. అయితే ముందే ఎన్నికలకు వెళ్లడానికి తామేం పిచ్చోళ్లం కాదని సజ్జల రామకృష్ణారెడ్డి సందర్భం వచ్చినప్పుడల్లా చెబుతూ ఉంటారు. కానీ సీఎం జగన్ తీసుకుంటున్న నిర్ణయాలన్నీ ఎన్నికలను ఎదుర్కోవడానికన్నట్లుగానే ఉన్నాయి. మరో ఐదారు నెలల్లో ఎన్నికలు ఎదుర్కోవడానికి అధికారంలో ఉన్న పార్టీలు ఏం చేస్తాయో అన్నీ ఆయన చేస్తున్నారు. జిల్లాలు పర్యటిస్తున్నారు.. పార్టీ నేతల్ని గడప గడపకూ పంపుతున్నారు.. అధికార యంత్రాంగాన్ని ఎన్నికలకు తగ్గట్లుగా ప్రక్షాళన చేస్తున్నారు. ఎలా చూసినా.. ముందస్తు ఎన్నికల సన్నాహాలేనన్న వాదన గట్టిగా వినిపిస్తోంది. మరోసారి గెలవాలంటే తప్పకుండా ముందస్తు ఎన్నికలు వెళ్లాలని జగన్ గట్టిగా నమ్ముతున్న ప్రశాంత్ కిషోర్ టీం సలహా ఇచ్చిందని వైసీపీలో కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది.అందుకే జగన్ ముందస్తు సన్నాహాలు ప్రారంభించారని చెబుతున్నారు. గతంలో తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన విధానాన్నే పాటిస్తూ.. షెడ్యూల్ కన్నా ఆరు నెలల ముందే ఎన్నికలకు వెళ్లాలని.. వైసీపీ అధినేత జగన్ భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. దానికి సన్నాహకంగా ఈ నవంబర్ నుంచి బస్సు యాత్ర చేపట్టాలని అనుకుంటున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపికపై కూడా పీకే టీమ్ సర్వే మొదలుపెట్టింది. గడప గడపకు కార్యక్రమం వల్ల ఎమ్మెల్యేల్లో ప్రజల పట్ల ఉన్న స్పందనను తెలుసుకుంటున్నారు. కొందరు ఎమ్మెల్యేలు ప్రజల నుంచి నిరసన సెగ ఎదుర్కొన్నారు. వీరందరి జాబితాను పీకే టీమ్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రానున్న ఎన్నికల్లో ఎవరికి అవకాశం వస్తుంది.. ఎవరికి అవకాశం రాదన్న దానిపై వైసీపీ అధినేత ఇప్పటికే క్లారిటీ ఇస్తున్నారు. ప్రత్యామ్నాయ నేతల్ని ప్రోత్సహిస్తున్న చోట.. వారే అభ్యర్థులు. నియోజకవర్గాల సమీక్షల్లో జగన్ ఈ విషయాన్ని నేరుగానే ప్రకటిస్తున్నారు. టెక్కలి వంటి చోట్ల వర్గ పోరు ఉన్నా అభ్యర్థిని ఖరారు చేశారు. అధిష్టానం వైఖరి ఏంటన్నది ఇప్పటికే నియోజకవర్గాల్లో అగ్రశ్రేణి నాయకత్వానికి అర్థం అయిపోయినట్లుంది. అందుకే ఎవరు ఉంటారో ఎవరు పోతారో అంతా అధినేత ఇష్టం అంటూ నాయకులు వరుసగా హింట్లు ఇస్తూనే ఉన్నారు? అటు అధినేత జగన్ కూడా ఇదే విషయాన్ని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. ఎవరూ తమకు టికెట్ ఖాయం అనే భావనలో ఉండొద్దని? జగన్ స్పష్టం చేశారు. ప్రజల్లోకి వెళ్లి మంచిమార్కులు తెచ్చుకున్నవారికే టికెట్ అంటూ కుండబద్ధలు కొట్టేశారు. ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు ముందస్తు ఊహాగానాలకు మరింత ఊతమిస్తున్నాయి. ఇందులో భాగంగానే ఆయన గడప గడపకు మన ప్రభుత్వం, సామాజిక న్యాయభేరీ బస్సు యాత్ర వంటి కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. తాజాగా బీసీ నేతలతో రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహించబోతున్నారు. ప్రతిపక్షాల పొత్తు రాజకీయాలకు.. ముందస్తు ఎన్నికల ద్వారా బ్రేక్ వేయాలనేది జగన్ వ్యూహంగా తెలుస్తోంది. జనసేనతో టీడీపీ కలిస్తే.. బీజేపీ దూరంగా ఉంటుందని భావిస్తున్న జగన్.. ప్రభుత్వ వ్యతిరేకత చీలి విజయం దక్కిందనుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈసారి టీడీపీ గెలుపును అడ్డుకుంటే భవిష్యత్తులో తిరుగుండదనేది జగన్ ఆలోచనగా భావిస్తున్నారు. అందుకే విధేయులైన అధికారుల్ని కీలకమైన పోస్టుల్లో నియమిస్తున్నారు. పోలింగ్ రోజున అధికార యంత్రాంగం కలసి వచ్చేలా సన్నాహాలు చేసుకుంటున్నారు. విమర్శలు వస్తున్నా ఒకే సామాజికవర్గానికి పెద్ద పీట వేశారనే విమర్శలువచ్చినా డీఎస్పీ పోస్టింగ్‌లు ఇచ్చినతీరే దీనికి నిదర్శనం అంటున్నారు.షెడ్యూల్ కంటే ముందుగానే ఎన్నికలకు ముఖ్యమంత్రి జగన్ గంట కొట్టేస్తారని అంచనా.. బహుశా వచ్చే ఏడాది ఏప్రిల్ ..మే సమయంలో ఉండవచ్చని కొన్ని వర్గాల విశ్లేషణ. ముందస్తు ఎన్నికల సన్నాహంలో భాగంగానే ఈమధ్య జగన్ పథకాల వేగం పెంచారు. ఉచితాలు కూడా ఊపందుకున్నాయి. మరోవైపు మూడు రాజధానుల మూడుముక్కలాట జోరు కూడా పెరిగింది. అధికారపార్టీ ఈ సన్నద్ధతలో భాగంగా తన వ్యూహాలు పటిష్టం చేసుకోవడంతో పాటు ప్రతిపక్షాల జోరు పెరగకుండా పగ్గాలు వేసే పనిలో కూడా గట్టిగా నిమగ్నం అయింది.ఒక పక్క తెలుగుదేశం నుంచి నాయకులను ఆకర్షించే వ్యూహాలు అమలు చేస్తూనే, మరో పక్క పవన్ కళ్యాణ్ దూకుడుకు కళ్లెం వేయడంపై ఎక్కువ దృష్టి పెడుతోంది అధికార పార్టీ. ప్రస్తుత పరిణామాలు దీన్నే నిర్ధారిస్తున్నారు. మరి జగన్ ఆలోచనలు ఎలా ఉన్నాయో... అసెంబ్లీ రద్దు చేసే వరకూ తెలియదు. ఎందుకంటే... ఈ ముందస్తు వ్యూహం ఎంత సీక్రెట్‌గా ఉంచుకుంటే.. అంత ప్రయోజనమని ఆయనకూ తెలుసు.

# ఫ్యాన్ క్రిందకు గంటా



విశాఖపట్టణం, నవంబర్ 28,తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ వైఎస్‌ఆర్‌సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. గంటా శ్రీనివాసరావు సన్నిహితులు ఇప్పటికే ఆ మేరకు లీకులు ఇస్తున్నారు. డిసెంబర్ మొదటి వారంలో వైజాగ్ పర్యటన కు వస్తున్న సీయం జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో ఆయన వైఎస్‌ఆర్‌సీపీలో చేరుతారని చెబుతున్నారు. డిసెంబర్ 1 న గంటా పుట్టిన రోజు సందర్భంగా ఆయన తన నిర్ణయాన్ని ప్రకటించే చాన్స్ ఉందని అంటున్నారు. 2019 లో టీడీపీ నుండి ఎమ్మెల్యే గా గెలిచిన గంటా శ్రీనివాసరావు తన పదవికి రాజీనామా చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణ ను నిరసిస్తూ ఆయన తన రాజీనామా లేఖను స్పీకర్ కు అందించగా అది ప్రస్తుతం పెండింగ్ లో ఉంది. ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ.. టీడీపీ పార్టీ ఓడిపోవడంతో ఆయన తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. పార్టీ అధినేత చంద్రబాబు విశాఖ కు వచ్చిన సందర్భాల్లోనూ గంటా పార్టీ కార్యక్రమాలకు హాజరు కాలేదు. అదే సమయంలో గంటా ను పార్టీలోనే అట్టి పెట్టుకునే ప్రయత్నాలు చేసింది తెలుగుదేశం అధిష్టానం. స్వయంగా అధినేత చంద్రబాబు హైదరాబాద్ లో గంటా శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి మరీ ఆయన కుటుంబ వేడుకల్లో పాల్గొన్నారు. అయితే ఆ తర్వాత కూడా గంటా శ్రీనివాసరావు పార్టీ కార్యక్రమాల్లో యాక్టివ్ గా పాల్గొనలేదు.కేవలం అయ్యన్న పాత్రుడు అరెస్ట్ విషయంలో మాత్రమే సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేసారు. అయితే.. ఇప్పుడు వైఎస్‌ఆర్‌సీపీ లో చేరేందుకు ఆయన రంగం సిద్ధం చేసుకున్నట్టు ఆయన క్యాంప్ సంకేతాలు ఇస్తోంది.మాజీ కేంద్రమంత్రి, మెగాస్టార్ కు అత్యంత సన్నిహితుడైన గంటా శ్రీనివాసరావు ప్రజారాజ్యం పార్టీలో కీలక నేత గా వ్యవహరించారు. ఆ పార్టీ కాంగ్రెస్ లో విలీనం అయ్యాక మంత్రి పదవి సైతం పొందారు.రాష్ట్ర విభజన తర్వాత టీడీపీలో చేరి అక్కడా మంత్రి పదవిని పొందారు.2019 ఎన్నికల్లో జగన్ హవా లో సైతం ఎమ్మెల్యే గా గెలిచిన గంటా శ్రీనివాసరావు ఆ తర్వాత టీడీపీ లో యాక్టివ్ గా ఉండడం తగ్గించారు. మధ్యలో చిరంజీవి సోదరుడు పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన లో చేరుతారనే గట్టి ప్రచారమే జరిగింది. అయినప్పటికీ అటు గంటా..ఇటు పవన్ ఇద్దరూ ఆ విషయంలో మౌనంగానే ఉంటూ వచ్చారు. ఇక 2024 ఎన్నికలకు రంగం సిద్దమవుతున్న నేపథ్యంలో గంటా శ్రీనివాసరావు చూపు వైఎస్‌ఆర్‌సిపీ వైపు మళ్లింది అంటున్నారు అయాన సన్నిహితులు.నిజానికి గంటా శ్రీనివాసరావు ఏడాది ముందే వైఎస్‌ఆర్‌సిపీ వైపు వెళ్లే ప్రయత్నం చేశారని అయితే ఆ ప్రయత్నాలు ఫలించలేదు అనే ప్రచారం ఉంది. అప్పట్లో మంత్రిగా ఉన్న అవంతి శ్రీనివాసరావు, ఇంచార్జి గా ఉన్న విజయ సాయి రెడ్డి లు గంటా చేరికను తీవ్రంగా వ్యతిరేకించారు . అయినప్పటికీ కొన్ని సార్లు ఆయన వైఎస్‌ఆర్‌సీపీలో చేరబోతున్నారన్న ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం మారిన పరిణామాల దృష్ట్యా గంటాకు లైన్ క్లియర్ అయినట్టు తెలుస్తోంది.

# సెంట్రల్ లో ఎమ్మెల్యే వర్సెస్ ఎమ్మెల్సీ

విజయవాడ, నవంబర్ 28, విజయవాడ సెంట్రల్‌లో వైసీపీ రాజకీయం రసకందాయంలో పడుతోంది. ఎమ్మెల్యే.. ఎమ్మెల్సీల మధ్య విభేదాలు మలుపులు తిరుగుతున్నాయి. మల్లాది విష్ణు. విజయవాడ సెంట్రల్ వైసీపీ ఎమ్మెల్యే. ఇదే నియోజకవర్గానికి చెందిన వైసీపీ ఎమ్మెల్సీ రుహుల్లా. ఇద్దరూ అధికారపార్టీ నేతలే అయినా.. సీనియర్.. జూనియర్ ఇగోలో.. భవిష్యత్ రాజకీయ ఎత్తుగడలో కానీ.. సెంట్రల్‌లో రసవత్తరంగా మారుతోంది రాజకీయం. రుహుల్లా తల్లి కరీమున్నీసా ఎమ్మెల్సీగా ఉన్నంత వరకు ఎలాంటి అలజడి లేదు. ఆమె ఆకస్మిక మరణంతో కరీమున్నీసా కుమారుడు రుహుల్లా ఎమ్మెల్సీ అయ్యారు. ప్రొటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే కంటే ఎమ్మెల్సీకే అగ్రాసనం ఉంటుంది. ఇది మల్లాది విష్ణుకు రుచించలేదో ఏమో పరిణామాలు మారిపోయినట్టు చెబుతున్నారు. అలా వచ్చిన గ్యాప్ పెరుగుతుందే తప్ప తరగడం లేదట. ఎమ్మెల్యే హోదాలో విజయవాడ సెంట్రల్‌లో మల్లాది విష్ణు చేపడుతున్న కార్యక్రమాల ఆహ్వాన పత్రికల్లో ఎమ్మెల్సీ రుహుల్లా పేర్లు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారట. అది గమనించిన ఎమ్మెల్సీ సైతం కౌంటర్ పాలిటిక్స్‌కు తెరతీశారట. ఇలా ఇద్దరు ప్రజాప్రతినిధులు రచిస్తున్న వ్యూహాలతో అధికార పార్టీ రాజకీయం వేడెక్కుతోంది. రుహుల్లా సైతం నియోజకవర్గంలో నిర్వహించే కార్యక్రమాలు.. అభివృద్ధి పనుల్లో జోక్యం చేసుకోవడం మొదలుపెట్టారట. అనుచరులకు పెద్దపీట వేయాలని ఒత్తిడి చేస్తున్నారట. కొన్ని పనులకు సంబంధించి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీసుకు వెళ్లి.. అక్కడే కూర్చుని అవి అయ్యే వరకు కదలడం లేదట ఎమ్మెల్సీ. సెంట్రల్ పరిధిలోని కొందరు వైసీపీ కార్పొరేటర్లను కూడా తనవైపునకు తిప్పుకొంటున్నారట.సమయంలో ఎమ్మెల్యే విష్ణుపైనా ఆరోపణలు చేస్తున్నారట సొంత పార్టీ నేతలు. సెంట్రల్‌లో కీలక నేతలు.. కార్యకర్తలను కాదని.. వేరేవారికి పదవులు కట్టబెడుతున్నారనేది ఆయనపై ప్రధాన ఆరోపణ. పార్టీ మారి వచ్చిన వారికి పెద్ద పీట వేస్తున్నారట. గడిచిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కొందరికి టికెట్లు రాకుండా అడ్డుకున్నారని మండిపడుతున్నారట. ఇలాంటి వాటిని రుహుల్లా తనకు అనుకూలంగా మలుచుకుంటున్నట్టు సమాచారం. టిట్ ఫర్ టాట్ అన్నట్టుగా ఎమ్మెల్సీ పాల్గొన్నే కొన్ని కార్యక్రమాలకు ఎమ్మెల్యే విష్ణును ఆహ్వానించడం లేదట.కొన్నాళ్లుగా ఈ ఆధిపత్యపోరు గట్టుగా సాగినా.. ఇటీవల కరీమున్నీసా వర్ధంతికి విష్ణు వెళ్లకపోవడంతో వ్యవహారం బయటపడింది. విష్ణు కావాలనే వెళ్లలేదనే విమర్శలు వినిపించాయి. అయితే ఇంట్లో శుభకార్యం ఉన్నందునే వెళ్లలేదని విష్ణు వర్గం చెబుతున్నా.. ప్రత్యర్థి శిబిరానికి అది పెద్దగా కనెక్ట్ కావడం లేదట. మైనారిటీలు అంటే ఎమ్మెల్యేకు చిన్న చూపు అనే చర్చను తెరపైకి తెస్తున్నారట. దీంతో ఇద్దరి మధ్య వివాదం చినికి చినికి గాలి వానగా మారే సంకేతాలు కనిపిస్తున్నాయట.ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధ్య రగడ.. సెంట్రల్ నియోజకవర్గానికే పరిమితం అయితే ఓకే కానీ.. మిగిలిన సెగ్మెంట్లకు పాకితే ఎలా అనేది వైసీపీ కేడర్ ప్రశ్న. నామినేటెడ్ పదవిలో కొనసాగుతున్న సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన కీలక నేత మద్దతు రుహుల్లాకు ఉందని ప్రచారం జరుగుతోంది. ఇక్కడి పరిణామాలపై పార్టీ అధిష్ఠానం ఒక కన్నేసినట్టు సమాచారం. మరి.. ఇద్దరు ముఖ్యనేతల మధ్య విభేదాలు శ్రుతిమించి రోడ్డున పడకుండా ఎలా పరిష్కరిస్తారో చూడాలి

## వేప చెట్టు కు అమ్మవారి ఆకారం

### బనగానపల్లెలో వింత ఘటన

బనగానపల్లె నంద్యాల జిల్లా బనగానపల్లె , తెలుగు పేట లోని పాత బావి వద్ద ఉన్న వేప చెట్టుకు వింత ఘటన చోటుచేసుకుంది. చెట్టు మొదలు బాగం లో అమ్మవారి రూపం తో ఆకారం ఏర్పడి కనిపించడంతో , స్థానికుల్లో భయంతో పాటు భక్తి భావం కూడా ఏర్పడింది. తెలుగు పేట కాలనీవాసులు ఇంటి ఇలవేల్పు అమ్మగా భావించి పూజించే సాక్షాత్తు జమ్ములమ్మ తల్లి వేప చెట్టుపై దర్శనం ఇచ్చిందంటూ.. అమ్మవారి రూపం ఆకారం ఏర్పడిన చోట , భక్తిశ్రద్ధలతో పసుపు కుంకుమలు రాసి , ఆభరణాలు అలంకరించి , ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేపచెట్టు పై అమ్మవారి ఆకారం ఏర్పడిన వింత ఘటన సమాచారం పట్టణం లోని వివిధ కాలనీవాసులకు తెలియడంతో పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి అమ్మవారికి, నైవేద్యం పెట్టి హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుకున్నారు.

## అన్యమత ప్రచారం...

### పొరపాటున జరిగిందన్న పోలీస్ శాఖ

విశాఖపట్టణం, నవంబర్ 28,విశాఖలో ట్రాఫిక్ పోలీసులు జారీ చేసిన రశీదుపై అన్యమత కీర్తనలు ఉండటంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఈ వివాదంపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగింది కాదని క్లారిటీ ఇచ్చారు. విశాఖ రైల్వేస్టేషన్‌లో ట్రాఫిక్ పోలీసులు నిర్వహించే ఆటోస్టాండ్‌లో ప్యాసింజర్స్‌కి ఇచ్చే టోకెన్లపై మతపరమైన కీర్తనలు ఉండటం వివాదానికి తెరలేపింది. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దాంతో విశాఖ పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. బీజేపీ నేతలు ట్రాఫిక్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ వ్యవహారమంతా పక్కా ప్లాన్ ప్రకారం జరుగుతోందని బీజేపీ నాయకుడు భానుప్రకాష్‌రెడ్డి ఆరోపిస్తున్నారు. అసలు సూత్రధారులు, పాత్రధారులను ప్రజల ముందు నిలబెట్టాలని తిరుపతిలో డిమాండ్ చేశారాయన. ఈ ఘటనపై పెద్దయెత్తున విమర్శలు రావడంతో పోలీసు ఉన్నతాధికారులు క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆటోస్టాండ్‌లో ప్రయాణికులకు ఇచ్చే టోకెన్లు అయిపోవడంతో గమనించకుండా పొరపాటున వేరే టోకెన్లు ఇవ్వడం జరిగిందని పోలీస్‌శాఖ తెలిపింది. కొత్త టోకెన్లు తీసుకురావాలని ప్రీపెయిడ్ ఆటో సెక్రటరీకి అక్కడి సిబ్బంది చెప్పడంతో.. అతడు బైబిల్ వాక్యాలతో కూడిన టోకెన్లను తీసుకువచ్చారని చెప్పింది. అయితే అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది అది గమనించకుండాలనే ప్రయాణికులకు టోకెన్లు ఇచ్చారని వివరణ ఇచ్చారు. ఇదంతా పొరపాటుగా జరిగిందని .. ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని స్పష్టం చేసింది.ఇదే విషయంపై సోషల్ మీడియా వేదికగా విశాఖ పోలీసు శాఖ వివరణ ఇచ్చింది. పలువురు నెటిజన్లకు సమాధానమిచ్చిన సిటీ పోలీసులు..ఓ ఆటోడ్రైవర్ తన అజ్ఞానంతో హెడ్ కానిస్టేబుల్‌కు అందజేసిన స్లిప్పులను అత్యవసర పరిస్థితుల్లో పంపిణీ చేశాడని వెల్లడించింది. వెంటనే వాటిని నిలిపివేశామని వివరణ ఇచ్చింది.

## రాజకీయ నాయకులు ప్రజలకోసం పనిచేయాలి

కడప నవంబర్ 28: (రాజకీయ నాయకులు ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయాల్సిన అవసరం ఉందని వైఎస్ఆర్సిపి పార్టీ ఆ ప్రభుత్వం హత్యలు దోపిడీలు తో ప్రజలను భయభ్రాంతులను గురిచేస్తుందని సత్య సాయి జిల్లా రాప్తాడు శాసనసభ్యుని తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నాయకులు నారా చంద్రబాబు నాయుడు. లోకేసులను ఇంట్లోకి పోయి చంపే వారేమని మాట్లాడితే ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి స్పందించకపోవడం జగన్ రెడ్డి హత్య రాజకీయాలను ప్రోత్సహించడం వైసిపి నాయకులతో మాట్లాడించడం సిగ్గుచేటని టిడిపి కడప అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వి ఎస్ అమీర్ బాబు తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో తీవ్రంగా పండిపడ్డారు. చంద్రబాబు నాయుడు తన రాజకీయ జీవితంలో పదు నాలుగు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా హింసకు తావు ఇవ్వకుండా ఉమ్మడి రాష్ట్ర ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసి భారతదేశంలోని రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన నాయకుడని ఆయన అన్నారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి రాష్ట్రంలో ప్రభుత్వం అరాచకాలు మితిమీరాయని అత్యా నేరాలు మానభంగాలు రౌడీయిజం అక్రమ కేసులు భూ కబ్జాలతో రాష్ట్ర పాలన రావణ కాష్టంగా మారిందని చంద్రబాబుకి ఏమి జరిగినా కూడా ప్రధాన ముద్దయి జగన్మోహన్ రెడ్డిన అమీర్ బాబు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు. టిడిపి నగర అధ్యక్షులు సానపరెడ్డి శివకొండ రెడ్డి రాష్ట్ర వాణిజ్య సెల్ ప్రధాన కార్యదర్శి రవి శంకర్ రెడ్డి ప్రతినిధి ఆమూరి బాలదాసు కృష్ణ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ నగర ఉపాధ్యక్షుడు కొండ సుబ్బయ్య పాల్గొన్నారు

## సీఎస్ గా తెరపైకి గిరిధర్

విజయవాడ, నవంబర్ 28, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా మరొకరి పేరు తెరపైకి వచ్చింది. కేంద్ర రక్షణశాఖ కార్యదర్శిగా ఉన్న గిరిధర్ అరమణే పేరు నూతన సీఎస్ లిస్ట్ లో వినిపిస్తుంది. ఆంధ్రప్రదేశ్ కేడర్ కు చెందిన సీనియార్టీ అధికారుల జాబితాలో గిరిధర్ అరమణే రెండో స్థానంలో ఉన్నారు. గిరిధర్ అరమణే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపడితే 2023 జూన్ 30 వరకు ఆయన ఆ పదవిలో కొనసాగనున్నారు. కొత్త సీఎస్ నియామకంపై ఇవాళ, రేపటిలో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుత ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ ఈనెల 30న పదవీ విరమణ చేయబోతున్నారు. డిసెంబరు 1వ తేదీ నుంచి కొత్త సీఎస్ బాధ్యతలు చేపట్టాల్సిఉంటుంది. ముందు కొత్త సీఎస్‌గా జవహర్‌రెడ్డిని నియమించనున్నట్లు వచ్చిన వార్తలు తెలిసిందే. నూతన సీఎస్‌గా ఎవరిని నియమించాలనే విషయంపై ఇంకా చర్చలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. నూతన సీఎస్ నియామకంపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.1988 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రస్తుతం కేంద్రం రక్షణశాఖ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారు. గిరిధర్ అరమణే ను కేంద్ర సర్వీసుల నుంచి రిలీవ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినట్లు తెలుస్తోంది. నూతన సీఎస్ గా జవహర్ రెడ్డి పేరు వినిపించినా తాజాగా గిరిధర్ అరమణే రేసులోకి వచ్చారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌తో గిరిధర్ అరమణే శనివారం భేటీ అయ్యారు. కొత్త సీఎస్ నియామకంపై కసరత్తు జరుగుతున్న సమయంలో ఈ భేటీపై చర్చ జరుగుతోంది. పార్టీతోపాటు ప్రభుత్వంలోనూ సీఎం జగన్ భారీగా మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే పార్టీలో కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వంలో కొన్ని మార్పులు చేయాలని భావిస్తున్నారు. అందులో భాగంగా ముఖ్యమైన సీఎస్ నియామకంపై సీఎం ఫోకస్ పెట్టారు. ప్రస్తుతం ఏపీ సీఎస్‌గా ఉన్న సమీర్ శర్మ మరో నాలుగు రోజుల్లో పదవీ విరమణ చేశారు. ఆయన ప్లేస్ ఎవర్ని తీసుకురావాలన్న డిస్కషన్ ప్రభుత్వంలో చాలా పెద్ద ఎత్తున జరుగుతోంది. వచ్చేది ఎన్నికల సంవత్సరాలు కాబట్టి ఆ దిశగానే నియామకం ఉంటుందన్న టాక్ నడుస్తోంది. ఈ పదవికి చాలా మంది ఐఏఎస్‌లు పోటీలో ఉన్నారు. ఈ పోటీలో సీఎం స్పెషల్ సెక్రెటరీగా ఉన్న జవహర్‌రెడ్డి వినిపించింది. ఆయన వైపే సీఎం జగన్ మొగ్గు చూపుతున్నట్టు వార్తలు వచ్చాయి. ఏ క్షణంలోనైనా ఆయన నియామక జీవో రిలీజ్ అయ్యే ఛాన్స్ ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయని లీక్ లు వచ్చాయి. కానీ లాస్ట్ మినిట్ లో మరో పేరు తెరపైకి వచ్చింది. కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్ అరమణే పేరు పైకి వచ్చింది. ఆయన సీఎం జగన్ తో భేటీ అవ్వడంతో లెక్కలు మారిపోయాయి. శ్రీలక్ష్మి, జవహర్ రెడ్డి, తర్వాత గిరిధర్ అరమణే పేరు సీఎస్ జాబితాలో చేరింది.

# పార్టీకి హైప్ సాధ్యమేనా



విజయవాడ, నవంబర్ 28,నారా లోకేష్ పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. జనవరి 27వ తేదీ నుంచి ఆయన పాదయాత్ర ప్రారంభించనున్నారు. పాదయాత్ర మాత్రం ఆరోజు మొదలవుతుందని మాత్రం తేదీ ఖరారయింది. మొత్తం నాలుగు వందల రోజుల పాటు చినబాబు జనంలోనే ఉండనున్నారు. ఆయన ప్రజలతో మమేకం అవుతూ దాదాపు నాలుగువేల కిలోమీటర్ల మేర ప్రయాణించనున్నారు. గతంలో వైఎస్ జగన్ చేసిన పాదయాత్ర కంటే ఇది ఎక్కువగా చెప్పుకోవాలి. ఇందుకు తగిన ఏర్పాట్లను పార్టీ నేతలు ఇప్పటి నుంచే మొదలు పెట్టారు. ఇచ్ఛాపురంలో ముగియనుంది. అయితే దాదాపు ఏడాది కాలం మంగళగిరి నియోజకవర్గానికి లోకేష్ దూరంగా ఉండాల్సి ఉంటుంది. ఇది చాలా ఎక్కువ సమయం అని పార్టీ నేతలు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో ఓటమి నుంచి కొంత కుదురుకుని పార్టీ బలోపేతం అవుతుందనుకుంటున్న సమయంలో లోకేష్ పాదయాత్ర చేపట్టడంతో మంగళగిరిలో మాత్రం పార్టీ నేతలు కొంత డీలా పడ్డారని తెలిసింది.లోకేష్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి. ఆయన రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాల్సి ఉంది. ప్రధానంగా యువతను ఆకట్టుకోవాల్సి ఉంది. అందుకు ఆయన రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయాల్సి ఉంటుంది. అది పార్టీకి అవసరం కూడా. ఎన్నికలకు ఇంకా పెద్దగా సమయం ఉండదు. మంగళగిరిలో పూర్తి స్థాయిలో కుదుకునేందుకు కూడా లోకేష్ కు టైం ఉండకపోవచ్చు. పూర్తిగా ద్వితీయ శ్రేణి నేతలపైనే ఆయన ఆధారపడక తప్పదు. ఏడాది నియోజకవర్గానికి దూరంగా ఉండాల్సి రావడం కొంత కష్టమేనని పార్టీ నేతలు కూడా అభిప్రాయపడుతున్నారు లోకేష్ పడే కష్టం మంగళగిరిపైన కూడా ప్రభావం చూపుతుందన్న వారు కూడా లేకపోలేదు. పాదయాత్ర వల్లనే నియోజకవర్గానికి దూరంగా ఉన్నారన్న కారణంతో మరింత సానుభూతి పెరిగే అవకాశం ఉందన్న లెక్కలు లేకపోలేదు. అందుకే ఏడాది పాటు దూరంగా ఉన్నప్పటికీ పెద్దగా ఇబ్బంది ఉండబోదంటున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలవాల్సిన పరిస్థి?తి ఉంటుంది. చంద్రబాబు పాదయాత్ర చేసి పార్టీని అధికారంలోకి తెచ్చారు. జగన్ కూడా అంతే. కానీ లోకేష్ పాదయాత్ర చేసినా అధికారంలోకి రాలేకపోతే మాత్రం ఆ అపవాదు జీవితాంతం వెంటాడుతూనే ఉంటుంది. అదే అధికారంలోకి వస్తే లోకేష్ కు వంద శాతం క్రెడిట్ లభిస్తుంది. చినబాబు పార్టీని మరింత బలోపేతం చేయడానికి ఈ యాత్రకు శ్రీకారం చుడుతుండటంతో పార్టీకి చెందిన యువతలో మాత్రం ఉత్సాహం పెల్లుబుకుతుంది. ఓట్లను రాబట్టడంలో లోకేష్ యాత్ర ఏ మేరకు ఉపయోగపడుతుందనేది భవిష్యత్ లో తేలాల్సి ఉంది.

# సముద్ర తీరానికి తూట్లు

కాకినాడ, నవంబర్ 28, తుపానులు, అల్పపీడనాల సమయంలో అలల ఉధృతితో సముద్ర తీరానికి తూట్లు పడుతోంది. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. కోతతో పలు గృహాలు సముద్రంలో కలుస్తున్నాయి. తీరాన్ని కాపాడేందుకు రాష్ట్రంలోనే మొదటిసారిగా అము చేసిన జియోట్యూబ్ టెక్నాలజీ అలల తాకిడికి పూర్తిగా దెబ్బతింది. దీంతో, ప్రకృతి వైపరీత్యాల సందర్భాల్లో తీరప్రాంత ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని తల్లడిల్లుతున్నారు. యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరం క్రమంగా కనుమరుగవుతోంది. గతంలో పేతారు, తిత్లీ, ఫణి, హెలెన్ వంటి తుపానుల సమయంలో ఉప్పాడ, కోనపాపపేట, సూరాడపేట తదితర గ్రామాల్లో వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. గడిచిన 50 ఏళ్లలో ఇక్కడ తీరం కిలోమీటరుకుపైగా ముందుకు చొచ్చుకొచ్చింది. ఫలితంగా 1,500 వరకూ ఇళ్లు, పలు దేవాలయాలు, ప్రభుత్వ భవనాలు సైతం సముద్రంలో కలిసిపోయాయి. 500 ఎకరాల పైబడి వ్యవసాయ భూమి కనుమరుగైందని స్థానిక మత్స్యకారులు తెలిపారు.18 సంవత్సరాల క్రితం 2004 డిసెంబర్‌లో వచ్చిన సునామీ కారణంగా ఈ ప్రాంత ప్రజలు అనేక అవస్థలు ఎదుర్కొన్నారు. బీచ్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తీరప్రాంతం కోతకు గురికాకుండా ఉప్పాడ శివారు కొత్తపట్నం నుంచి బర్మా కాలనీ వరకూ 200 మీటర్ల పొడవున 2005 మార్చిలో కోటి రూపాయలతో ఆర్ అండ్ బి అధికారులు పెద్ద పెద్ద బండరాళ్లను వేశారు. అయినా, సముద్రపు కోతను నివారించలేకపోయారు. ఈ నేపథ్యంలోనే అప్పటి కేంద్రం మంత్రి ఎం.ఎం.పళ్లంరాజు హయాంలో రూ.14 కోట్లతో 1.53 కిలోమీటర్ల పొడవున 2007లో జియోట్యూబ్‌ను నిర్మించారు. దీంతో, తీర ప్రాంతం కోతను కొంతకాలం పాటు నివారించగలిగారు. ఖైముక్, నీలం తుపానుల సమయంలో జియోట్యూబ్ ఈ తీరాన్ని కోత నుంచి కాపాడింది. అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో ప్రస్తుతం ఇధి ధ్వంసమైంది.కాకినాడ నుంచి ఉప్పాడ వరకు సుమారు 15 కిలోమీటర్ల పొడవునా బీచ్ రోడ్డు ఉంది. మాయాపట్నం నుంచి కాకినాడ వైపు బీచ్ రోడ్డు గుండా సుమారు ఒక కిలోమీటరు పొడవున సమద్రకోత నివారణకు బండరాళ్లు, రెండు వేల సిమెంటు దిమ్మలు డంప్ చేశారు. అయినా, సముద్ర కోతను అడ్డుకోలేకపోయారు. దీంతో, చిన్నపాటి కెరటాలకే ఉప్పాడ – కాకినాడ బీచ్‌రోడ్డు ఛిద్రమవుతోంది. మరమ్మతులకు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు పెడుతున్నా ప్రయోజనం ఉండడం లేదు. ఉప్పాడ తీరమంటే కాంట్రాక్టర్లకు కాసుల పంటగా మారిందనే విమర్శలు వెల్లువెత్తాయి. ఎన్నిమార్లు మొరపెట్టినా అధికారులు, ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారానికి పట్టించుకోవట్లేదని మత్స్యకారులు, తీర ప్రాంతవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఐదేళ్ల కాలంలో సముద్రపు కోత తీవ్రంగా ఉంది. తుపానులు వచ్చినప్పుడల్లా తీర ప్రాంతంలో ఉన్న ఇళ్లు సముద్రంలో కలిసిపోతున్నాయి. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని భయం భయంగా జీవించాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా తీరప్రాంత రక్షణకు సరైన చర్యలు తీసుకోవాలి.

# ఆర్కేకు అసమ్మతి సెగ

గుంటూరు, నవంబర్ 28,ఊహించని అసమ్మతి సెగ అక్కడ అధికారపార్టీ ఎమ్మెల్యేను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. వలస నాయకులు ఏకు మేకులా మారితే.. ఇప్పుడు సొంత పార్టీ నాయకులే ముచ్చెమటలు పట్టిస్తున్నారు. దీంతో ఆయన ముందు జాగ్రత్త పడుతున్నారనే వాదనా ఉంది.ఆళ్ల రామకృష్ణారెడ్డి. మంగళగిరి నుంచి వరసగా రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అలాంటిది కొన్ని నెలలుగా ఆళ్లకు పార్టీలోనూ.. మంగళగిరిలోనూ పట్టు సడలుతుందనే ప్రచారం ఉంది. వైసీపీ నేతల నుంచే విమర్శలు ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. సమస్యలను సర్దుబాటు చేసుకునే దిశగా చర్యలు చేపట్టలేదు. దాంతో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా మంగళగిరిలోనే అసమ్మతి నేతలు సమావేశం పెట్టుకునే వరకు వ్యవహారం వెళ్లింది. ఆ భేటీ పార్టీ వర్గాల్లోనూ.. నియోజకవర్గం వైసీపీ శ్రేణుల్లోనూ కలకలం రేపుతోంది.అసమ్మతి నేతల సమావేశం తర్వాత మంగళగిరిలో ఆర్కేకు ప్రత్యామ్నాయం ఎవరనే చర్చ కూడా మొదలైంది. రెండుసార్లు ఎమ్మెల్యేగా చేసిన వారికి ప్రజల్లో అసమ్మతి ఉండటం సహజమైనా.. ఇక్కడ మాత్రం సొంత పార్టీలోని పార్టీకి అనుకూలమైన సామాజికవర్గం నుంచే ఆర్కేపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నియోజకవర్గాన్ని.. తాడేపల్లి ప్రాంతాన్ని అభివృద్ధికి దూరంగా పెట్టారని ఎమ్మెల్యేపై కస్సుమంటున్నారు నాయకులు. పైగా అసమ్మతి సమావేశానికి పెద్ద సంఖ్యలో పార్టీ నేతలు హాజరయ్యారు. రాబోయే రోజుల్లో ఆర్కేను అడ్డుకోవాలని ఏకంగా తీర్మానమే చేశారట. వైసీపీ అధిష్ఠానానికి చెప్పి అభ్యర్థిని మార్పించే యోచనలో వైసీపీ కేడర్, లీడరర్స్ ఉన్నట్టు తెలుస్తోంది.మంగళగిరిలో వ్యతిరేకత వస్తున్న తరుణంలో పల్నాడులోని ఓ నియోజకవర్గానికి షిఫ్ట్ అయ్యే ఆలోచనలో ఆర్కే ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఆ విషయం తెలుసుకున్న స్థానిక వైసీపీ నాయకులు కర్చీఫ్ వేసేందుకు రెడీ అయ్యారు. ఆర్కేకు తామే ప్రత్యామ్నాయం అని ప్రచారం చేసుకుంటున్నారట. మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు ఇప్పటికే వైసీపీలో చేరి ఎమ్మెల్సీ అయ్యారు. ఆయన కుటుంబంలో మరొకరికి ఎమ్మెల్యే సీటు ఇస్తారనే వాదన ఉంది. ఈ మధ్య వైసీపీలో చేరిన గంజి చిరంజీవి సైతం టికెట్ ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో అసమ్మతి సమావేశం నిర్వహించడం మంగళగిరి రాజకీయాలను మరో లెవల్‌కు తీసుకెళ్లాయి.ఆర్కే అంశాన్ని ఏకంగా వైసీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లే యోచనలో ఉన్నారట అసమ్మతి నేతలు. తాడేపల్లి మండంలోని పార్టీ నేతలను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని.. పనులు జరగడం లేదని.. నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాలనే అభివృద్ధి చేస్తున్నారని మండిపడుతున్నారట. ఎన్నికల్లో వైసీపీని గెలిపించిన వారిని విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు అసమ్మతి నేతలు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో జరుగుతున్న పనులను.. వాటిల్లో చూపెడుతున్న వ్యత్యాసాలపై గరంగరంగా ఉన్నారట. ముఖ్యంగా టీడీపీ పట్ల ఆయన వైఖరి జీర్ణించుకోలేకపోతున్నట్టు కొందరి వాదన. ఇప్పటం ఎపిసోడ్‌లోనూ పెదవి విప్పలేదని గుర్తు చేస్తున్నారు. మరి.. నేతల అసమ్మతి నియోజకవర్గంలో ఒక్క ప్రాంతానికే పరిమితం అవుతుందో.. మరింత విస్తరిస్తుందో చూడాలి

# ఘనంగా జ్యోతిరావు పూలే వర్ధంతి

నందికొట్కూరు మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి నందికొట్కూరు శాసనసభ్యులు ఆర్తర్ ఆధ్వర్యంలో సోమవారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా నందికొట్కూరు శాసనసభ్యులు తోగుర్ ఆర్థర్ మాట్లాడుతూ సందర్భంగా నందికొట్కూరు పట్టణంలోని ఆత్మకూరు రోడ్డులో ఉన్న శ్రీ మహాత్మ జ్యోతిరావు పూలే కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ హాజీ అబ్దుల్ శుకూర్, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ డైరెక్టర్ గంగిరెడ్డి రమాదేవి , రాష్ట్ర బి.సి.సంఘం నాయకులు కురుమూర్తి , నందికొట్కూరు పట్టణ వైస్ చైర్మన్ మొల్ల రబ్బానీ, పట్టణ కౌన్సిలర్స్ ఉండవల్లి ధర్మా రెడ్డి , మొల్ల జాకీర్, నందికొట్కూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ సగినేల ఉసేనయ్య, పట్టణ మహిళా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వనజ, మాజీ కౌన్సిలర్ ఆర్ట్ శ్రీను, తోడిచర్ల గ్రామ సర్పంచ్ బాల మద్దిలేటి, కొణిదెల గ్రామ ఉపసర్పంచ్ భాస్కర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ చందమాల బాలస్వామి. వైసిపి నాయకులు తమడపల్లి విక్టర్, జాన్ సార్, తిమ్మాపురం నాగన్న, లక్ష్మాపురం బూసిగౌడ్, బిజినవేముల మహేష్, మల్యాల శంకరయ్య, ఎర్రగూడూరు బాలేశ్వర్ రెడ్డి, గుండం గోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, భాస్కర్, వెంకటస్వామి, రఫీ,ముజీబ్ ఇతర వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారతదేశపు తొలి విమాన చోదకుడు,గొప్ప పారిశ్రామికవేత్త జె.ఆర్.డి.టాటా

## -నేడు ఆయన వర్ధంతి



భారతదేశపు ప్రముఖ పారిశ్రామికవేత్త, తొలి విమాన చోదకుడు, ఎయిర్ ఇండియా వ్యవస్థాపకుడు, టాటా గ్రూప్ ఛైర్మన్ జహంగీర్ రతన్ జీ దాదాభాయి టాటా, ఈయనకు 1992లో భారతరత్న పురస్కారాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్యారిస్ లో జన్మించిన ఈయనను "జెహ్" లేక "జేఆర్డీ"గా సంబోధిస్తారు. ఈయన తల్లి ఫ్రాన్సు దేశస్థురాలు కావడంతో, ఈయన ఫ్రెంచి భాషను మొదటి భాషగా నేర్చుకున్నాడు. 1929లో ఈయన భారతదేశములోనే మొట్టమొదటి పైలట్ లైసెన్సు పొందాడు. 1932 లో ఈయన భారతదేశపు తొలి వాణిజ్య విమానసేవలను టాటా ఎయిర్ లైన్స్ పేరుతో ప్రవేశపెట్టాడు. 1946లో అది "ఎయిర్ ఇండియా"గా రూపాంతరం చెందింది. తర్వాతికాలంలో ఆయన భారతదేశపు పౌరవిమానయాన పితామహుడుగా ప్రశంసింపబడ్డాడు.34 ఏళ్ళ వయసులో ఆయన టాటా వ్యాపారసంస్థలకు పెట్టుబడిదారీ సంస్థ హోల్డింగ్ కంపెనీ లేక మాతృసంస్థ అయిన టాటా సన్స్ సంస్థకు ఛైర్మనుగా బాధ్యతలు చేపట్టి 1991 వరకు ఆ పదవిలో కొనసాగాడు. సుదీర్ఘమైన ఆయన హయాంలో టాటా గ్రూపు ఆస్తులు అరవైరెండు కోట్ల రూపాయల నుండి పదివేల కోట్ల రూపాయల పైబడి పెరగగా, గ్రూపులో సంస్థలు పదిహేను నుండి నూటికి పైగా చేరుకున్నాయి.జహంగీర్ రతన్‌జీ దాదాభాయి టాటా ఫ్రాన్స్ లోని ప్యారిస్‌లో రతన్‌జీ దాదాభాయి టాటాకు ఆయన ఫ్రెంచ్ సతీయణి అయిన సుజానె బ్రెయిర్‌కూ రెండో బిడ్డగా 1904 జూలై 29 లో జన్మించాడు. ఆయన తండ్రి భారతదేశంలో తొలి పారిశ్రామికవేత్త అయిన జెంషెట్‌జీ టాటాకు దాయాది సోదరుడు. టాటా ఫ్రాన్స్‌లోని బీచ్‌బడ్డున ఉన్న హార్డెలోట్‌లో తన బాల్యాన్ని గడిపినప్పుడు, ఆయనకు విమానయానం పైన ఆసక్తి ఏర్పడింది. విమానాలు నడపడంలో ఆద్యుడైన లూయీ బ్లెరియో నుండి ఆయన స్ఫూర్తి పొందాడు.1929 లో టాటా భారతదేశంలో మొట్టమొదట పైలట్ లైసెన్సు పొందాడు. తర్వాతి కాలంలో ఆయన భారత పౌర విమానయాన పితగా గుర్తింపు పొందాడు. భారతదేశంలో మొట్టమొదటి వాణిజ్య విమానయాన సంస్థ టాటా ఎయిర్ లైన్స్‌ను 1932 లో స్థాపించాడు. అదే తర్వాత 1946 లో ఎయిర్ ఇండియాగా మారింది.ఆయన తల్లి ఫ్రెంచ్ దేశానికి చెందినవారవటం వల్ల ఆయన తన బాల్యాన్ని ఎక్కువగా ఫ్రాన్స్‌లోనే గడిపాడు. అతను నేర్చుకున్న మొదటి భాష ఫ్రెంచ్. ఆయనకు ఎన్నో ఇష్టాలుండేవి. కేంబ్రిడ్జ్‌లో చదువుకోవాలనుకున్నాడు. వేగంగా వెళ్లే కార్లపై మోజు పడేవాడు, ఫ్రెంచ్ సైన్యంలో లా సఫిస్ (సిపాయి?) అనే రెజిమెంట్‌లో పనిచేశాడు. ముంబయిలోని కాథెడ్రల్, జాన్‌కానన్ పాఠశాల్లో చదువుకున్నాడు.1925 లో టాటా స్టీల్ కంపెనీలో అప్పటి డైరెక్టర్ ఇన్‌ఛార్జి అయిన జాన్ పీటర్సన్ దగ్గర పనిచేయడానికి బొంబాయి హౌజ్‌కు వచ్చాడు.1938 లో టాటా సన్స్‌కి చైర్మన్ అయిన సర్ నౌరోజి సక్లత్ వాలా చనిపోగానే 34 ఏళ్ల వయస్సున్న జె.ఆర్.డి దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక సామ్రాజ్యానికి అధిపతి అయ్యాడు.చాలా దశాబ్దాల పాటు స్టీల్, ఇంజినీరింగ్ ఎల్లక్ట్రికల్ కంపెనీ వంటి ఎన్నో పరిశ్రమున్న టాటా గ్రూప్ సంస్థను ఉన్నత ప్రమాణాలతో, ఏ రాజకీయవేత్తకూ లంచాలూ ముడుపులూ చెల్లించకుండా, నల్లబజారు మార్గం ఎంచుకోకుండా ఆయన వ్యాపారం నడిపించాడని కీర్తి పొందాడు. ఈ రోజుకూ విశ్వాసానికి మారుగా టాటా పేరు గడించాడు. 1939 లో దేశంలో మళ్లీ మళ్లీ ఏర్పడుతున్న కొరతను తీర్చడానికై స్వయం ఆధారితమైన మౌలిక కర్బనేతర రసాయన పరిశ్రమ టాటా కెమికల్స్‌ను భారతదేశం కోసం ప్రారంభించాడు. 1945 టాటా స్టీల్ వారు భారత రైల్వే శాఖలో లోకోమోటివ్స్‌ను ఉత్పత్తి చేసే ఉద్దేశంతో టాటా ఇంజనీరింగ్ అండ్ లోకోమోటివ్ కంపెనీని స్థాపించాడు. టెల్కోను తర్వాత టాటా మోటర్సుగా మార్పు చేసి భారతదేశంలోనూ, విదేశాల్లోనూ ఆటోమోటివ్ మార్కెట్‌లో అత్యంతప్రధానమైనదిగాను తీర్చిదిద్దాడు. జెఆర్‌డి అధ్యక్షతన టాటా గ్రూప్ కంపెనీ 15 నుండి 100 కు అభివృద్ధి చెందాయి.1932 లో టాటా విమానయాన సర్వీసును ప్రారంభించడం ద్వారా ఆయనకు విమానాలపై ఉన్న ఆశ నెరవేరింది. మొట్టమొదటి భారత పౌర విమానం కరాచీలోని డ్రిగ్ రోడ్డు విమానక్షేత్రం నుండి 1932 అక్టోబరు 15 న భయుదేరి టాటానే స్వయంగా ఒంటరిగా దాన్ని నియంత్రిస్తుండగా అహ్మదాబాద్‌కు, అక్కడి నుండి బాంబేకు చేరింది. టాటా ఏవియేషన్ సర్వీస్ ప్రారంభమైన మొదటి సంవత్సరంలో వందకు వంద శాతం సమయపాలన పాటిస్తూ 10,000 రూపాయి లాభాన్ని పొందింది. 1953 లో ప్రభుత్వం విమానయాన వ్యాపారాన్ని జాతీయం చేయాని నిర్ణయించి ఆ పరిశ్రమకు అధ్యక్షుడుగా టాటాను ఆహ్వానించింది. దేశంలోని విమానయాన పరిశ్రమ అప్పుడు ఆధ్వాన్న స్థితిలో ఉండింది. టాటా ఏవియేషన్ తర్వాత 1946 లో ఎయిర్ ఇండియాగా మారింది. టాటా అంత:కరణ కలిగిన చైతన్యవంతమైన పౌరుడు, జాతికి సేవందించడంలో ఎప్పుడూ విఫలం కాలేదు.1941 లో ఆసియాలోని మొదటి కేన్సర్ ఆసుపత్రిని టాటా నేతృత్వంలో 1941 లో ప్రారంభించాడు. అంతర్జాతీయంగా కేన్సర్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో టాటా మెమోరియల్ ఆసుపత్రి భారతదేశంలో మొట్టమొదటిది. దేశంలో శాస్త్ర రంగ పరిశోధన కోసం డా.హోమీబాభాకు, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పండ్‌మెంటల్ రిసెర్చ్' స్థాపించడానికై టాటా గొప్ప వితరణతో గ్రాంటు ఇచ్చాడు. హోమి భాభా మాటల్లో చెప్పాంటే ఆ ఇన్‌స్టిట్యూట్ మన ఆటోమిక్ ఎనర్జీ ప్రోగ్రాంకి నాంది అనవచ్చు. జనాభా నియంత్రణ కోసం మొదటగా కృషి ప్రారంభించింది టాటానే.1951 జనాభా లెక్క ప్రకారం భారతదేశం 35 కోట్ల జనాభాను మించిపోయిందని ఆయన గుర్తించాడు. టాటా ఈ విషయాన్ని అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ దృష్టికి తీసుకువెళ్లాడు. కానీ ఆయన దాన్ని పట్టించుకోలేదు. జెఆర్‌డి ప్రభుత్వ స్పందన కోసం అగలేదు, మిసెస్ ఆవాబాయి వాడియా ప్రారంభించిన భారత కుటుంబ నియంత్రణ అసోసియేషన్‌కు పాక్షిక సాయం అందించాడు. 1970 లో ఫోర్డ్ ఫౌండేషన్‌తో కలిసి కుటుంబ నియంత్రణ సంస్థను స్థాపించాడు.ఈ రంగంలో ఆయన చేసిన కృషికిగాను 1992 లో ఆయనకు యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ అవార్డు ప్రదానం చేశారు.భారతదేశానికి, వాణిజ్య పరిశ్రమ రంగాకు అందించిన ఎనలేని సేవకు గుర్తుగా 1992 లో టాటాకు, ఆయన జీవించిఉండగానే ఇది ఎంతో అరుదైన సంఘటన భారతదేశపు అత్యున్నత పౌరపురస్కారం భారతరత్నతో గౌరవించారు. 1954 లో ఫ్రెంచ్ ప్రభుత్వం అయనకు అవార్డు నిచ్చింది. వాణిజ్య విమానయాన సంస్థకు అయన అందించిన విశిష్టసేవకు గాను ఆయనకు టోనీ జానస్ అవార్డు లభించింది.1988 లో ఆయన ప్రతిష్ఠాత్మకమైన గుగెన్ హేమ్ మెడల్‌ను పొందారు.జెఆర్‌డి టాటా తన 89వ ఏట 29 నవంబర్ 1993 లో స్విట్జర్లండ్‌లోని జెనీవాలో మరణించాడు. ఆయనను పారిస్‌లోని పెర్ షైజ్ శ్మశానవాటికలో ఖననం చేశారు. ఇండియన్ పార్లమెంట్, అసాధారణంగా ఏ ప్రభుత్వ రాజకీయపదవీ అనుభవించని సామాన్య పౌరుడైన ఆయనకు నివాళిగా సభను వాయిదా వేసింది. మహారాష్ట్ర మూడు రోజు సంతాపదినాలుగా ప్రకటించింది.

# ముగిసిన శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు

**పంచమితీర్థంనాడు విశేష సంఖ్యలో భక్తుల పవిత్రస్నానం**

**- భక్తులకు టీటీడీ విస్తృత ఏర్పాట్లు**

**-. జర్మన్ షెడ్లలో వేచి ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు పంపిణీ**

**-. పోలీసులు, టీటీడీ విజిలెన్స్, శ్రీవారి సేవకులు, స్కౌట్స్ విశేష సేవలు**

తిరుపతి, నవంబరు 28 తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన కార్తీక బ్రహ్మోత్సవాలు సోమవారం పంచమితీర్థ మహోత్సవంతో ఘనంగా ముగిశాయి. చివరిరోజు ఆలయం వద్ద గల పద్మ పుష్కరిణిలో జరిగిన చక్రస్నానం కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు విచ్చేసి పవిత్రస్నానాలు ఆచరించారు. ఈ ఉత్సవానికి విచ్చేసిన అశేష భక్తజనవాహినికి ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. టీటీడీ ధర్మకర్తల మండలిఅధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, సివిఎస్‌వో నరసింహ కిషోర్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఎస్వీబీసీ సిఈఓ షణ్ముఖ్ కుమార్ , టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.పటిష్టమైన భద్రతా ఏర్పాట్లుపంచమితీర్థానికి విచ్చేసిన భక్తులకు పోలీసు శాఖ సమన్వయంతో టీటీడీ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు సేద తీరడానికి ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్ల నుంచే ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటుచేసి భక్తులను క్రమపద్ధతిలో పుష్కరిణిలోకి అనుమతించారు. పుష్కరిణిలోకి ప్రవేశించేందుకు, తిరిగి వెళ్లేందుకు వేరువేరుగా గేట్లను ఏర్పాటుచేశారు. సివిఎస్‌వో శ్రీ నరసింహ కిషోర్, ఎస్పీ శ్రీ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని పుష్కరిణి వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. కాలినడకన వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా తిరుచానూరు బయటి నుంచే వాహనాలను దారి మళ్లించారు. తిరుపతి నుంచి వచ్చే వాహనాలకు, పాడిపేట వైపు నుంచి వచ్చే వాహనాలకు ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టారు. 2500 మంది పోలీసులతోపాటు టీటీడీ భద్రతా సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్.సి.సి విద్యార్థులతో భద్రతా ఏర్పాట్లు చేశారు.శ్రీవారి సేవకులు, స్కౌట్స్ విశేషసేవలుబ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు శ్రీవారి సేవకులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విశేష సేవలు అందించారు. ఆలయంలోని క్యూలైన్లు, వాహనసేవల్లో, అన్నప్రసాద భవనం, జర్మన్ షెడ్లలో భక్తులకు సేవలందించారు. మొత్తం 1000 మంది శ్రీవారిసేవకులు, స్కౌట్స్ అండ్ గైడ్స్ భక్తులకు సేవలు అందించారు.జర్మన్ షెడ్లలో వేచి ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు పంపిణీ భక్తుల కోసం అయ్యప్ప స్వామి ఆలయం, పూడి రోడ్డు, జెడ్పీ హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్లలో వేచి ఉన్న భక్తులకు ఆదివారం మధ్యాహ్నం నుంచి కాఫీ, టి, బాదం పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు విస్తృతంగా అందజేశారు.భక్తులకు వైద్యసేవలుబ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు విశేషంగా వైద్యసేవలు అందించారు. అమ్మవారి వాహనం మోసే వాహనబేరర్లకు వైద్యపరంగా తగిన చర్యలు చేపట్టి ఉపశమనం కల్పించారు. టీటీడీ వైద్యులతోపాటు స్విమ్స్, రుయా ఆస్పత్రుల నుంచి వైద్యసిబ్బంది, ఆయుర్వేద వైద్యులు సేవలందించారు. తోళప్పగార్డెన్‌లో ఉన్న డిస్పెన్సరీతోపాటు అదనంగా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. 6 అంబులెన్సులతోపాటు శుక్రవారపుతోట పద్మపుష్కరిణి వద్ద ప్రథమచికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు.సాంస్కృతిక కార్యక్రమాలకు విశేష స్పందన హిందూ ధార్మిక ప్రాజెక్టులు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో ప్రతిరోజూ వాహనసేవల్లో కోలాటాలు, భజనలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన జానపద కళాబృందాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తిరుచానూరులోని ఆస్థానమండపం, తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరం, మహతి కళాక్షేత్రం, రామచంద్ర పుష్కరిణి శిల్పారామం వేదికలపై ప్రతిరోజూ ఆధ్యాత్మిక, ధార్మిక, సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. ఎస్వీ గోశాల ఆధ్వర్యంలో వాహనసేవల ఎదుట గజాలు, అశ్వాలు, వృషభాల ఊరేగింపు వేడుకగా సాగింది.పార్కింగ్ పంచమి తీర్థానికి విచ్చేసే భక్తులకు శిల్పారామం, తనపల్లి క్రాస్, మార్కెట్‌యార్డు, పూడి రోడ్డు ,తిరుచానూరు బైపాస్ వద్ద పార్కింగ్ ఏర్పాట్లు చేశారు.

# అధికార మదంతో రౌడిలా ప్రవర్తిస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి

**నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వి జి కృష్ణతేజ నాయుడు**

ఎమ్మిగనూరు ఎమ్మిగనూరు పట్టణంలో అనంతపురం జిల్లా రాప్తాడు వైసిపి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి సోదరుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి తన అన్న అధికారాన్ని అడ్డంపెట్టుకొనిఅధికారమదంతోరౌడీలా ప్రవర్తించడం సరికాదని హెచ్చరించారు.ఈసందర్భంగా ఎమ్మిగనూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వి జి కృష్ణతేజ నాయుడు ఆధ్వర్యంలో పత్రికా సమావేశం నిర్వహించి ప్రసంగిస్తూ ...... రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా తీసుకుని వచ్చి ఉపాధి కల్పించడం చేతకాదు కానీ ఇదేంటని ప్రశ్నించిన వారిపై గుండాయిజంచేయడం వైసిపి నాయకులకు పరిపాటిగా మారిందని పేర్కొన్నారు.గతంలోమా టిడిపిపార్టీ హయాంలో మా ప్రియతమ నేత మాజీ ముఖ్యమంత్రి వర్యులు గౌ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కనుసైగ చెసింటే మీరు మీ వైసిపి పార్టీ అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో పాదయాత్ర చేసేవారా ?అని సూటిగా ప్రశ్నించారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదని వాపోయారు. చేతనైతే ప్రజలకు మంచి చేయాలి కానీ ఇలా ప్రజలను భయభ్రాంతులకుగురిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జాతీయ టిడిపి అధ్యక్షులుగౌశ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి, జాతీయటిడిపిప్రధాన కార్యదర్శి గౌ శ్రీ నారా లోకేష్ గారికి తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని పత్రికా ముఖంగా డిమాండ్ చేశారు. వైసిపి నాయకులు రౌడీలా ప్రవర్తించడం మాని ప్రజల్లో తిరిగి వారి సమస్యలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తే మంచిదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో రంజిత్, శేఖర్, రంజిత్, నరేష్, ఉమేష్, ఈరన్న, వీరేష్, పవన్, తేజ, వెంకట్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బహుజనోద్ధారకుడు పూలే:పద్మావతమ్మ ప్రధాన ఉపధ్యారాలు



డోన్.:డోన్ పట్టణం పాతపేట లోని సోమవారం ఉదయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ అధ్యక్షతన మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు, ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ జ్యోతిరావు పూలే మహారాష్ట్ర లో పుట్టి వెనుక బడిన తరగతుల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు అని కొనియాడారు,వారు తన భార్య సావిత్రి భాయి పూలే కు చదువు చెప్పి, ఆమెతోబాలికలకోసంపాఠశాల నెలకొల్పి, బాలికల విద్యాభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి అన్నారు.,ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకట రమణ, సి.వి.సుబ్బారెడ్డి, చంద్రశేఖర్ గౌడ్, అల్లిపీరా, శ్రీనివాసులు, లక్ష్మి కాంతరెడ్డి,సురేష్,సుభాన్, మధుసూదన్ రెడ్డి, మద్దిలేటి,రాధ, సంజీవరెడ్డి రమేష్ భాను ప్రకాష్ రెడ్డి, సుబ్బారాయుడు, లక్ష్మి ప్రభావతి, ప్రసాద్ రావు, ముని రాజు, మహేష్, అల్లిపీరా, తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం సిపిఐ తలపెట్టిన పాదయాత్ర జయప్రదం కోరుతూ" గోడపత్రాలు విడుదల



బద్వేలు కడప జిల్లాలో నిత్యం కరువు వలసలు ఆత్మహత్యలకు నిలయంగా మారిన క్రమంలో జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం 2011లో ఉక్కు ఉద్యమాన్ని ప్రారంభించిన కారణంగా అప్పటి కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర యువజన సందర్భంలో కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్మాణం చేస్తుందని చట్టంలో చెప్పి నేటికీ దశాబ్ద కాలం పూర్తి అయిన ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని అందుకే సిపిఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 9 నుంచి 13 వరకు కన్నెతీర్థం నుండి కలెక్టరేట్ వరకు జరుగుతున్న పాదయాత్రల గోడపత్రాలను సిపిఐ బద్వేలు పట్టణ సమితి ఆధ్వర్యంలో విడుదల చేశారు ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్ ఏరియా కార్యదర్శిజకరయ్య మాట్లాడుతూ.....

### "మలిదశ ఉక్కు ఉద్యమ పోరాటంలో విద్యార్థి యువకులు, నిరుద్యోగులు కదలిరండిసిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాదయాత్ర పోస్టర్స్ విడుదల

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కడప జిల్లా ప్రజలను వంచించింది అని రాయలసీమలో బిజెపి నాయకులు వెనుక వాటి గురించి అనర్గళంగా, ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చి మోసగిస్తున్నారని బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావలసిన అధికార వైసిపి ప్రతిపక్ష టిడిపి, జనసేన నరేంద్ర మోడీ జపం చేస్తూ ఈ ప్రాంత అభివృద్ధికి ఏ మాత్రం పాటుపడడం లేదని చదువుకున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు దేశాలకు అసలు పోతున్నారని రాయలసీమ జిల్లాల నుండి అనేకమంది మంత్రులు ముఖ్యమంత్రులు ప్రధాన మంత్రులు అయినప్పటికీ అభివృద్ధి శూన్యమని రాజన్న పాలన తీసుకు వస్తానని గద్దెనెక్కిన జగనన్న మన జిల్లా వాసైనప్పటికీ, ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు కడప జిల్లా కేంద్రంలో ఒక్క ఉద్యమం లో పాల్గొని నేను అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల కాలంలో ఉక్కు పరిశ్రమ పూర్తి చేస్తానని నమ్మ పలికి మరో 15 మాసాలు ప్రభుత్వం అధికారంలో మాత్రమే ఉంటుందని మరి ఏ విధంగా ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తారనివారు ప్రశ్నించారు, రాబోవు ఎన్నికలలో కడప జిల్లా ప్రజలకు ఏం సమాధానం చెప్పి ఓట్లు అడుగుతారని వారన్నారు. జరుగుతున్న మలిదశ ఉక్కు ఉద్యమంలో స్వయంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ గారు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఓబులేసు గారు, ఈశ్వరయ్య గారు పాల్గొంటున్న నేపథ్యంలో ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్త ఉద్యమంగా మలచ బోతున్నారని ఈ ఉద్యమంలో సిపిఐ జాతీయ నాయకులు కూడా పాల్గొనబోతున్నట్లు వారు తెలిపారు. అందుకే అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు తమ సంపూర్ణమైనటువంటి మద్దతు, ఇచ్చి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కళ్ళు తెరిపించే విధంగా చేయాలని వారు విజ్ఞప్తి చేశారు ఈ గోడ పత్రాలను ప్రతి పట్టణ, మండల,గ్రామీణ ప్రాంతాలలో సైతం అంటించి ఒక్క ఉద్యమ ఆవశ్యకతను ప్రజలకు అవగాహన కల్పిస్తామని వారన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ ఏరియా సహాయ కార్యదర్శి చంద్రమోహన్ రాజు, పట్టణ కార్యదర్శి బాలు, సహాయ కార్యదర్శి జి ఎల్ నరసింహ, కార్యవర్గ సభ్యులు పెంచలయ్య,బాబు, సంజీవ్ పివి రమణ, విజయమ్మ, నాగేష్, ఇమ్మానియేల్, ఆర్ శ్రీనివాసులు, నాగ సుబ్బయ్య నాయకులుచెన్నయ్య,సుబ్బారెడ్డి, వడ్డమాను బ్రహ్మయ్య, యాదవ్ సుబ్బయ్య, కన్నమ్మ, ముర లక్ష్మమ్మ, పాండు, తదితరులు పాల్గొన్నారు

## అంతర్రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన వైయస్సార్సీపి సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

ఎమ్మిగనూరు, ఎమ్మిగనూరు పట్టణంలో ఎమ్మెల్యే"ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" ఆధ్వర్యంలో పట్టణంలోని వీవర్స్ కాలనీ గ్రౌండ్ నందు శ్రీ నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా వై.యస్.ఆర్ అంతర్ రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహింస్తున్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం రిబ్బన్ కట్ చేసి ఇనగ్రేషన్ మ్యాచ్ ను ప్రారంభించిన మన ప్రియతమ నాయకులు, నియోజకవర్గ సీనియర్ నాయకుడు "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు, ఈ సందర్భంగా "ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి" గారు మాట్లాడుతూ క్రీడాకారులు ప్రతిభ కనబర్చి విజయం సాధిం చేందుకు కృషి చేయాలి, క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకోవాలన్నారు. ఎమ్మిగనూరు శ్రీ నీలకంటేశ్వర స్వామి జాతర సందర్భంగా నెల రోజుల ముందే క్రీడాలకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. జరుగు పోటీలను ప్రతి ఒక్కరూ కనబర్చాలని సూచించారు. క్రికెట్ పోటీలతో పాటు ఎద్దుల పోటీలు, కబడ్డీ, ఫుట్ బాల్, వాలీ బాల్ తదితర క్రీడలు జాతర సందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగానే పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ మధుసూదన్ గారు, రూరల్ సిఐ మంజునాథ్ గారు, ఎంపీపీ కేశన్న, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెయస్ రఘు, వైస్ చైర్మన్ డి. నజీర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ ఎన్. గంగిరెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షులు రియాజ్ అహ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, ప్రధాన కార్యదర్శి యూకె. వీరేంద్ర, కోశాధికారి తారా రాజశేఖర్, అధికార ప్రతినిధి కె. సునీల్ కుమార్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకె. రాజశేఖర్, కో ఆపరేషన్ స్టోర్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, కో ఆప్షన్ మెంబర్, కౌన్సిలర్లు, ఇన్ ఛార్జ్ లు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# పెద్దమండెం యస్ ఐ వెంకటేశ్ ను సస్పెండ్ చేయాలి

చిన్న మండెం నవంబర్28: పెద్దమండెం ఎస్సై వెంకటేశ్ ను సస్పెండ్ చేయాలని కోరుతూ అన్నమయ్య జిల్లా ఎస్పీకి సోమవారం గ్రీవెన్స్ లోఫిర్యాదు చేశామని అఖిల్ భారత రైతు కూలీ సంఘం అన్నమయ్య జిల్లా నాయకులు పోరెడ్డి రమణారెడ్డి తెలిపారు ఎస్ ఐ ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు ఎస్ఐ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు ఎస్ ఐ ను సస్పెండ్ చేసే అంతవరకు పోరాడుతామని పోరెడ్డి రమణారెడ్డి పిలుపునిచ్చారు గత 25.09.2022, వతేదీ ఉదయం 8 గంటల 50 నిమిషాలు సమయంలో వెలిగల్లు సమీపంలో టు వీలర్ వాహనం యాక్సిడెంట్ లో ఇద్దరు వ్యక్తులు మరణించారు ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు అయితే అక్కడ వైద్యం సర్గిగా లేనందున బెంగళూరు సంజయ్ కు రెఫర్ చేశారు అయితే ఎస్ఐ కేసు తప్పుడు కంప్లైంట్ తీసుకొని బాధితుడు పైనే కేసు నమోదు చేశారని చెప్పారు బాధితుడికి హాస్పటల్లో మతిస్థిమితం సరిగా లేదని కె కర్నాకర్ రెడ్డి మాట్లాడలేని స్థితిలో వుండగా ఎఫ్ఐఆర్ మీద వేలిముద్ర వేపించుకొని బాధితునికి అన్యాయం చేశారని అఖిల భారత రైతు కూలీ సంఘం చిత్తూరు ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి పోరెడ్డి రమణారెడ్డి ఆరోపించారు పెద్దమండెం ఎస్సై కొంత మంది అధికార పార్టీ నాయకులు, భూస్వాములతో కలిసి వారి ప్రలోభాలకు లొంగి ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు బాధితులను లోపల పిలిపించి కుంటి సాకులు చెప్పి బాధితులను భయపెట్టి వారి ఇష్టారాజ్యంగా కేసులు నమోదు చేసి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు ఇప్పుటికే దాదాపు 15 లక్షల రూపాయలు వైద్యం కర్చు అయిందని తెలిపారు అయితే గత 24-11-2022 వతేదీబాధితుల తల్లి కే సరస్వతమ్మ ఇన్ని రోజులైనా సాక్ష్యాలు పెట్టే కేసు ఇచ్చినా గాని ఈ కేస్ పైన ఇంతవరకు విచారణ లేదు

# ఈ ఏడాదిని విజయవంతంగా ముగిస్తారా..?





కరోనా పాండమిక్ కారణంగా గత రెండేళ్లుగా ఒడిదుడుకులను ఎదుర్కొన్న ఇండస్ట్రీ.. మళ్ళీ మెల్లిగా ట్రాక్ లోకి వచ్చింది. మేకర్స్ ఎప్పటిలాగే వారం వారం సరికొత్త సినిమాలతో ప్రేక్షకులను వినోదాన్ని అందిస్తూ వస్తున్నారు. 2022 లో ఇప్పటి వరకూ అనేక చిత్రాలు టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సందడి చేసాయి. అందులో కొన్ని బ్లాక్ బస్టర్స్ గా నిలిస్తే.. మరికొన్ని సూపర్ హిట్లు - హిట్లుగా నిలిచాయి. ఇంకొన్ని మాత్రం ఆడియన్స్ ని ఆకట్టుకోలేక ఫ్లాప్స్ గా మిగిలాయి.ఇప్పుడు దాదాపు ఏడాది చివరకు వచ్చేసాం. డిసెంబర్ లో బాక్సాఫీస్ వద్ద తమ అదృష్టాన్ని పరీక్షించుకోడానికి అనేక చిత్రాలు వస్తున్నాయి. సాధారణంగా డిసెంబర్ నెలను సినిమాలకు మంచి సీజన్ గా భావిస్తుంటారు. గతంలో స్టార్ హీరోలు క్రిస్మస్ కు తమ చిత్రాలని రిలీజ్ చేయటానికి ఆసక్తి కనబర్చేవారు. గతేడాది 'అఖండ' 'పుష్ప' 'శ్యామ్ సింగరాయ్' వంటి చిత్రాలు సందడి చేశాయి. కానీ ఈసారి మాత్రం చిన్న మీడియం రేంజ్ హీరోల సినిమాలు వస్తున్నాయి.టాలెంటెడ్ యాక్టర్ అడివి శేష్ హీరోగా నటించిన "హిట్: ది సెకండ్ కేస్" చిత్రం డిసెబర్ 2న విడుదల కాబోతోంది. నేచురల్ స్టార్ నాని సమర్పిస్తున్న ఈ క్రైమ్ థ్రిల్లర్ కు శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్నారు. ఇది 'హిట్: ది ఫస్ట్ కేస్' చిత్రానికి సీక్వెల్. ఇప్పటి వరకూ వచ్చిన టీజర్ - ట్రైలర్ మంచి రెస్పాన్స్ తెచ్చుకొని సినిమాపై అంచనాలు రెట్టింపు చేశాయి.కోలీవుడ్ స్టార్స్ విష్ణు విశాల్ మరియు ఐశ్వర్య లక్ష్మి హీరోహీరోయిన్లుగా నటిస్తోన్న చిత్రం "మట్టి కుస్తీ". చెల్లా అయ్యావు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 2న తెలుగు తమిళ భాషల్లో విడుదల చేయటానికి సన్నాహాలు చేస్తున్నారు. మాస్ మహారాజా రవితేజ సమర్పిస్తుండటంతో ఈ సినిమాపై అందరి దృష్టి నెలకొంది.డిసెంబరు రెండో వారంలో "పంచతంత్రం" అనే సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో బ్రహ్మానందం - సముద్రఖని - కలర్స్ స్వాతి - శివాత్మిక రాజశేఖర్ - నరేష్ ఆగస్త్య - రాహుల్ విజయ్ తదితరులు ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. హర్ష పులిపాక దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే నెల 9న రిలీజ్ చేయనున్నారు. అదే రోజున 'రాజయోగం' అనే మరో చిన్న సినిమా కూడా అదృష్టాన్ని పరీక్షించుకోనుంది.సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న "అవతార్ 2" చిత్రం డిసెంబర్ 16న విడుదల కాబోతోంది. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. తెలుగుతో సహా ప్రపంచ వ్యాప్తంగా 160 భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో ఆ వారంలో ఇతర తెలుగు చిత్రాలేవీ థియేటర్లలోకి రావడం లేదు.మాస్ రాజా రవితేజ నటిస్తున్న 'ధమాకా' చిత్రం క్రిస్మస్ స్పెషల్ గా డిసెంబర్ 23న ప్రేక్షకుల ముందుకి రాబోతోంది. త్రినాథరావు నక్కిన ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రమోషన్ కంటెంట్ తో ఆసక్తిని కలిగించిన ఈ చిత్రాన్ని తెలుగు హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. నిఖిల్ సిద్ధార్థ్ - అనుపమ పరమేశ్వరన్ జంటగా నటించిన "18 పేజెస్" చిత్రం కూడా డిసెంబర్ 23 విడుదల కానుంది. డైరెక్టర్ సుకుమార్ కథ అందించిన ఈ సినిమాకి పల్నాటి సూర్య ప్రతాప్ దర్శకత్వం వహించారు. 'కార్తికేయ-2' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నిఖిల్ నుంచి రాబోతున్న ఈ రొమాంటిక్ మూవీపై అందరిలో అంచనాలు నెలకొన్నాయి.సంతోష్ శోభన్ హీరోగా నందినీ రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం "అన్నీ మంచి శకునములే". క్రిస్మస్ కానుకగా డిసెంబరు 21న ఈ లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ ప్రేక్షకుల ముందుకి తీసుకురావాలని చూస్తున్నారు. ఇందులో మాళవిక నాయర్ హీరోయిన్ గా నటిస్తోంది.యాక్షన్ హీరో విశాల్ నటించిన తమిళ డబ్బింగ్ మూవీ "లాఠీ" కూడా క్రిస్మస్ రిలీజుల జాబితాలోకి వచ్చి చేరింది. వినోద్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ హై ఆక్టేవ్ యాక్షన్ ఎంటర్టైనర్ ని పాన్ ఇండియా స్థాయిలో తెలుగు తమిళ్ హిందీ మలయాళం కన్నడ భాషల్లో డిసెంబరు 22న రిలీజ్ చేయనున్నారు.కృష్ణవంశీ దర్శకత్వంలో ప్రకాష్ రాజ్ - రమ్యకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన "" చిత్రాన్ని కూడా డిసెంబర్ లోనే విడుదల చేయటానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలానే దగ్గుబాటి వారసుడు అభిరామ్ హీరోగా తేజ దర్శకత్వం వహించిన "అహింస" సినిమాని వచ్చే నెలలోనే ప్రేక్షకుల ముందుకి తీసుకురావాలని చూస్తున్నారు. ఇక సుధీర్ బాబు నటిస్తున్న "హంట్" చిత్రాన్ని కూడా డిసెంబర్ లోనే రిలీజ్ చేయనున్నారని టాక్ వినిపిస్తోంది.

# 'పంచతంత్రం' ట్రైలర్: పంచేద్రియాల ఇతివృత్తంగా ఐదు కథల సమాహారం..!

ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం - కలర్స్ స్వాతి రెడ్డి - సముద్రఖని - రాహుల్ విజయ్ - శివాత్మిక రాజశేఖర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం "పంచతంత్రం". కొత్త దర్శకుడు హర్ష పులిపాక తెరకెక్కిస్తున్నాడు. నిర్మాణాంతర కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని రిలీజ్ కు రెడీ చేస్తున్నారు.'పంచతంత్రం' నుంచి ఇప్పటివరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై ఆసక్తిని కలిగించాయి. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్ ను ఆవిష్కరించారు. స్టార్ హీరోయిన్ రష్మిక మందన్నా ఈ ట్రైలర్ ను రిలీజ్ చేసి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపింది.పంచతంత్రం అనేది ఐదు కథల సమాహారంగా తెలుస్తోంది. బ్రహ్మానందం ఈ కథలను చెప్పడంతో ట్రైలర్ ప్రారంభమవుతుంది. దీని కోసం ఆయన దృష్టి - వాసన - ధ్వని - రుచి - స్పర్శ వంటి పంచేద్రియాల థీమ్ ని ఎంచుకున్నారు. ఇది శాంతి - భయం - సంకల్పం - ప్రేమ - జీవితంతో వ్యవహరించే ఒక బ్యూటిఫుల్ మోడరన్ స్టోరీ అని తెలుస్తోంది.ఇందులో కలర్స్ స్వాతి ఫిజికల్ హ్యాండీక్యాప్ గా ఛాలెంజింగ్ రోల్ లో కనిపించింది. ఆమె ఒక రేడియో జాకీగా పరిచయం చేయబడింది. సముద్రఖని - దివ్యవాణి మిడిల్ ఏజ్ భార్యా భర్తలుగా.. ప్రేమ వివాహం చేసుకున్న జంటగా వికాస్ ముప్పాల - దివ్య శ్రీపాద.. ప్రేమికులుగా రాహుల్ విజయ్ - శివాత్మిక రాజశేఖర్ కనిపించారు. ఆదర్శ్ బాలకృష్ణ - ఉత్తేజ్ - నరేష్ అగస్త్య - శ్రీవిద్య ఇతర పాత్రలు పోషించారు.ప్రతి ఒక్కరి జీవితాలు భిన్నంగా ఉన్నాయి.. ప్రతి కథకు కూడా ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. 'కష్టం వచ్చింది కదా అని దించేసుకోడానికి ఇది భారం కాదు.. బాధ్యత' 'నీ లైఫ్ ఎంత ఇంపార్టెంట్ అనుకుంటావో.. నీతో షేర్ చేసుకునే వారి లైఫ్ కూడా అంతే ఇంపార్టెంట్ అనుకున్నప్పుడు అడ్జస్టెంట్ కు ఉన్న వేల్యూ తెలుస్తుంది' వంటి డైలాగ్స్ ఆలోచింపజేసేలా ఉన్నాయి.ట్రైలర్ చూస్తుంటే.. 'పంచతంత్రం' అనేది క్లాస్ ఆడియన్స్ ని ఆకట్టుకునే సినిమా అనిపిస్తోంది. సంగీతం మరియు విజువల్స్ కూడా అందుకు తగ్గట్టుగానే ఉన్నాయి. ఓవరాల్ గా అన్ని రకాల ఎమోషన్స్ తో కూడిన ఈ ట్రైలర్ ఆకట్టుకుంటోంది. ప్రశాంత్ ఆర్ విహారి ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. 'కలర్ ఫోటో' ఫేమ్ సందీప్ రాజ్ డైలాగ్స్ రాశారు. రాజ్ కె నల్లి సినిమాటోగ్రఫీ అందించగా.. గ్యారీ బీహెచ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు.




## హార్దిక్‌తో పాటు టీమిండియా కెప్టెన్సీ రేసులో ఆ యువ ప్లేయర్ కూడా! జట్టులో చోటుకే దిక్కులేదు!




పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా తదుపరి కెప్టెన్ ఎవరన్న అంశంపై గత కొంతకాలంగా క్రీడా వర్గాల్లో చర్చ జరుగుతోంది.ప్రస్తుతం మూడు ఫార్మాట్లకు సారథిగా ఉన్న రోహిత్ శర్మ వయసు(35 ఏళ్లు) దృష్ట్యా, విశ్రాంతి పేరిట వరుస సిరీస్‌లకు అతడు దూరమవుతున్న నేపథ్యంలో కొత్త కెప్టెన్ ఆవశ్యకత గురించి ఇప్పటికే పలువురు మాజీలు తమ అభిప్రాయాలు వెల్లడించారు.ఇక ద్వైపాక్షిక సిరీస్‌లలో రోహిత్ నేతృత్వంలో అదరగొట్టిన టీమిండియా ఆసియా కప్, ప్రపంచకప్-2022 టోర్నీల్లో వైఫల్యం చెందిన విషయం తెలిసిందే. ముఖ్యంగా ఈ రెండు ప్రధాన టీ20 టోర్నీల్లో బ్యాటర్‌గా, కెప్టెన్‌గా హిట్‌మ్యాన్‌కు మంచి మార్కులు పడలేదు. ఇదిలా ఉంటే.. ఇప్పటికే రోహిత్ గైర్హాజరీలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా టీ20 జట్టుకు నాయకుడిగా వ్యవహరిస్తున్నారు.ఐర్లాండ్‌తో సిరీస్ గెలవడం సహా కివీస్ గడ్డపై కూడా ట్రోఫీ గెలిచి సత్తా చాటాడు పాండ్యా. ఈ క్రమంలో త్వరలోనే టీ20 పూర్తి స్థాయి కెప్టెన్‌గా అతడి నియామకం ఖరారు కానుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ ఓపెనర్ గౌతం గంభీర్ మరో కొత్త పేరును తెరమీదకు తెచ్చాడు.ఢిల్లీలో ఆదివారం జరిగిన ఫిక్కీ(ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ) ఈవెంట్‌కు గౌతీ హాజరయ్యాడు. ఈ సందర్భంగా క్రికెట్‌కు సంబంధించిన విషయాలు ప్రస్తావనకు రాగా.. కెప్టెన్సీ అంశం గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు.ఐసీసీ ఈవెంట్‌లో ప్రదర్శనను బట్టి రోహిత్ శర్మ కెప్టెన్సీని జడ్జ్ చేయడం సరికాదన్న గంభీర్.. అతడిపై విమర్శలు దురదృష్టకరం అని పేర్కొన్నాడు. ఇక హిట్‌మ్యాన్ తర్వాత టీమిండియా కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యాకు అవకాశం ఉందని గౌతీ అభిప్రాయపడ్డాడు.అయితే, పృథ్వీ షా కూడా భావి భారత జట్టు కెప్టెన్ కాగల అర్హత కలవాడని గంభీర్ పేర్కొనడం విశేషం. కాగా గతేడాది శ్రీలంక పర్యటనలో భాగంగా చివరిసారిగా టీమిండియా తరఫున ఆడిన షా.. ఇప్పటి వరకు మళ్లీ జట్టులో స్థానం సంపాదించలేకపోయాడు. అంతర్జాతీయ టెస్టులాడి కూడా రెండేళ్లకు పైనే అయింది.ఇదిలా ఉంటే.. 2019లో యాంటీ- డోపింగ్ టెస్టులో విఫలమైన పృథ్వీ షా.. కొన్నాళ్లపాటు క్రికెట్ ఆడకుండా నిషేధం ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఇక ఫిట్‌నెస్‌పై దృష్టి సారించడంలో విఫలమైన అతడు.. ఈ ఏడాది మార్చిలో యో-యో టెస్టులో విఫలమయ్యాడు. ఈ క్రమంలో దేశవాళీ టోర్నీలో సత్తా చాటుతున్నప్పటికీ టీమిండియాలో మాత్రం చోటు దక్కించుకోలేకపోతున్నాడు.ఇలా జట్టులో స్థానం కోసం ఎదురుచూస్తున్న షా గురించి గంభీర్ మాట్లాడుతూ.. "జట్టు కూర్పు గురించి బయట చాలా మంది చాలా రకాలుగా మాట్లాడతారు. నిజానికి సెలక్టర్లు, కోచ్‌లు ఎన్నో రకాలుగా ఆలోచించాల్సి ఉంటుంది. 15 మందిని సెలక్ట్ చేయడం కాదు.. అందులో ఎవరు సరైన వాళ్లో చూసుకోవాలి.పృథ్వీ షా దూకుడైన కెప్టెన్. విజయవంతమైన సారథిగా అతడికి పేరుంది. ఆటగాడిగా కూడా అతడు భేష్. అందుకే టీమిండియా భవిష్యత్ కెప్టెన్‌గా నేను అతడి పేరును సూచించాను" అని గంభీర్ చెప్పుకొచ్చాడు. గంభీర్ వ్యాఖ్యలపై స్పందించిన నెటిజన్లు... "జట్టులో చోటే లేని ఆటగాడు కెప్టెన్ అవుతాడా? ఏం మాట్లాడుతున్నావు గంభీర్?" అంటూ విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

# యంగ్ హీరో ఓకే చెప్పినా డైరెక్టర్ నో చెప్పాడు!

రెమ్యునరేషన్ నుండి స్క్రిప్టింగ్ వరకు అనేక సమస్యల కారణంగా అక్షయ్ కుమార్ క్రేజీ ఫ్రాంఛైజీ హేరాఫేరి 2 నుండి తప్పుకున్న సంగతి తెలిసిందే. ఖిలాడీ స్వయంగా ఈ నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించుకున్నప్పటి నుండి గత కొన్ని రోజులుగా 'హేరా ఫేరి 3' మీడియా హెడ్ లైన్స్ లో నిలుస్తోంది. నిజానికి 'భూల్ భూలయ్యా 2' విజయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఫిరోజ్ నదియాడ్ వాలా కార్తీక్ ఆర్యన్ ని - అనీస్ బాజ్మీని హేరా ఫేరీ 3 ప్రాజెక్టులో చేర్చుకోవడానికి చాలా ఆసక్తిగా ఉన్నారని కథనాలొచ్చాయి. అయితే తాజా సమాచారం మేరకు.. అనీస్ బజ్మీ ఈ మూవీకి నో చెప్పారని తెలిసింది. ఇతర సినిమాల షెడ్యూళ్లతో క్లాష్ దీనికి కారణం.ముంబై మీడియా సమాచారం ప్రకారం.. అనీస్ తదుపరి షాహిద్ కపూర్ తో ఒక భారీ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు.. దాని తర్వాత ఒక 'సూపర్ హీరో కామెడీ'ని తెరకెక్కించాల్సి ఉంటుంది. కార్తీక్ - ఫిరోజ్ ఇద్దరూ అనీస్ కోసం చాలా ఆసక్తిగా వేచి ఉన్నారు. కానీ అనేక రౌండ్ల చర్చల తర్వాత దర్శకుని తేదీలు సరిపోలలేదు.ఇతర ప్రాజెక్టులకు కమిటవ్వడంతో అనీష్ కి వీలు పడడం లేదని తెలిసింది. అనీస్ ఇకపై హేరా ఫేరి 3కి దర్శకత్వం వహించడం లేదు. అతడు కార్తీక్- ఫిరోజ్ ఇద్దరికీ అదే విషయాన్ని తెలియజేసాడు. 'హేరా ఫేరి 3' నిజానికి అతడికి సరైన ఆప్షన్.. కానీ తప్పదు.. తేదీల సమస్య. కార్తీక్- సునీల్ శెట్టి - పరేష్ రావల్ పోషించిన మూడు ప్రధాన పాత్రలకు తనదైన టింజ్ యూనిక్ నెస్ ని తీసుకురావడానికి అతడు చాలా ఆసక్తిగా ఉన్నాడు. కానీ తానొకటి తలిస్తే దైవమొకటి తలచిన చందంగా అయ్యింది.అనీస్ బజ్మీ హేరా ఫేరి 3 కి పని చేయకపోయినా త్వరలో కార్తీక్ ఆర్యన్ తో మళ్లీ కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నాడు. త్వరలో వీరిద్దరూ కలిసి మరో సినిమా చేయనున్నారు. అనీస్ ముందస్తు కమిట్ మెంట్ లు లేకపోతే 'హేరా ఫేరీ3' కూడా సాధ్యమయ్యేది. ఒకవేళ కార్తీక్ తో అనీష్ పునఃకలయిక భూల్ భూలయ్యా 3తో వీలుపడే ఛాన్సుంటుందని తెలిసింది.ఫిరోజ్ - కార్తీక్ ప్రస్తుతం 'హేరా ఫేరి 3' కోసం రాజ్ శాండిల్యతో మాట్లాడుతున్నారు. ఈ చర్చలు ఫలవంతమైతే 'డ్రీమ్ గర్ల్ 2' తర్వాత రాజ్ శాండిల్యకు మరో చక్కని సదవకాశంగా భావించాలి. హేరా ఫేరి 3 ప్రపంచాన్ని ముందుకు నడిపించేందుకు రాజ్ బాగా సరిపోతాడని భావిస్తున్నారు. మునుముందు ఈ ఎంపిక ఎలాంటి మలుపు తిరుగుతుందో చూడాలి. ఈ భారీ క్రేజీ ఫ్రాంచైజీలోని ఇద్దరు అనుభవజ్ఞులైన నటులు సునీల్ శెట్టి - పరేష్ రావల్ లతో కలిసి కార్తీక్ మూడో భాగం కోసం బరిలో దిగడం ప్రస్తుతం బాలీవుడ్ లో చర్చనీయాంశంగా మారింది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190